

ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్


తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్థాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -161 | పేజీలు - 8 | వెల ₹03/- | శుక్రవారం 18 సెప్టెంబర్ 2026

ఇంధన భద్రతకే ప్రాధాన్యం



రష్యా నుంచి ఆయిల్ కొనొద్దు..

భారత్‌కు అమెరికా అల్టిమేటం..

ఘాటుగా స్పందించిన న్యూఢిల్లీ

రష్యాపై కొత్త ఆంక్షల బిల్లును ఆమోదించిన యూఎస్ కాంగ్రెస్

100శాతం వరకు టారిఫ్‌లు విధించేలా చట్టంలో నిబంధన

తమ ఇంధన భద్రతకే తొలి ప్రాధాన్యమని స్పష్టం చేసిన భారత్

ఈ చర్య ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీస్తుందని యూఎస్‌కు న్యూఢిల్లీ వార్నింగ్

ఢిల్లీ సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)

రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాలకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. రష్యాపై ఆధారపడటం తగ్గించుకోకపోతే, అసాధారణమైన ఆర్థిక ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. రష్యాపై కొత్త ఆంక్షల బిల్లును యూఎస్ కాంగ్రెస్ ఆమోదించిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యతను**మిగతా 2లో...**

మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి పరుగులు

వారాణసీ-వడ్‌నగర్ సేవా అభియాన్‌లో సీఎం చంద్రబాబు



దేశాన్ని ప్రగతి దిశగా నడుపుతున్నారు

జాతి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారు

మేకిన్ ఇండియాను బలోపేతం చేశారు

నదుల అనుసంధానం ఆయనతోనే సాధ్యం

మహిళలకు 33శాతం కోటా.. గేమ్ చేంజర్

ఏపీకి కేంద్రం నుంచి పెద్దఎత్తున సహకారం

వారాణసీ-వడ్‌నగర్ సేవా అభియాన్‌లో సీఎం

అవి వస్తే ఉపాధి, అభివృద్ధి: చంద్రబాబు



అమరావతి/వారాణసీ /సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)

'సుస్థిరతతో నమ్మకం పెరుగుతుంది. నమ్మకంతో పెట్టుబడులు వస్తాయి. పెట్టుబడుల వల్ల ఉద్యోగాలు సమకూరుతాయి. అభివృద్ధి జరుగుతుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రధాని మోదీని దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడిగా అభివర్ణించారు. మోదీ పాతికేళ్ల ప్రజాప్రస్థానాన్ని పురస్కరించుకుని గురువారం వారాణసీలోని రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన 'వారాణసీ-వడ్‌నగర్ సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు.దేశాన్ని మోదీ అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని, రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా జాతి ప్రయోజనాల కోసం పనిచేస్తున్న ఆయనకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని తన ప్రసంగంలో పిలుపిచ్చారు. కాశీ పుణ్యక్షేత్రం మోదీ కర్మభూమి అని.. వారాణసీకి నేతను ఎన్నుకోవడమే కాదు...దేశానికి ఓ గొప్ప నాయకుడిని అందించిందని తెలిపారు. 'వీకేఎస్ అనేది అభివృద్ధి మంత్రం.**మిగతా 2లో...**

సెమీకండక్టర్ రంగంలో భారత్ దూకుడు..



భారత్‌పై ప్రపంచానికి విశ్వాసం పెరుగుతోంది: ప్రధాని మోదీ

సెమీకాన్ ఇండియా 2026ను ప్రారంభించిన ప్రధాని మోదీ

ప్రపంచమంతా భారత చిప్స్ వెళతాయని ధీమా

నాలుగేళ్లలోనే 70,000 మంది డిజైన్ ఇంజనీర్లకు శిక్షణ ఇచ్చామన్న అశ్విని వైష్ణవ్

ఢిల్లీ సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)

ప్రపంచవ్యాప్తంగా క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటోందని, దేశంపై అంతర్జాతీయ విశ్వాసం గణనీయంగా పెరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సెమీకండక్టర్, ఫిన్‌టెక్, లాజిస్టిక్స్ వంటి **మిగతా 2లో...**

వైభవంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం..

పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి

అమరవీరులకు నివాళులర్పించిన రేవంత్ రెడ్డి

సామాజిక న్యాయమే పునాదిగా పాలన అందిస్తున్నామన్న సీఎం

రాష్ట్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు



2004 వరకు కేసీఆర్‌కు ఎకరా భూమి లేదు

నాటి ఎన్నికల అఫిడవిట్‌లో ఆయనే వెల్లడించారు

ఇప్పుడు 440 ఎకరాలు ఎక్కడినుంచి వచ్చాయ్?

భూస్వాముల కుటుంబమైతే

భూముల వివరాలు ఎందుకు దాచారు?

నిలదీసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)

తనకు 2004 వరకు ఒక్క ఎకరం భూమి కూడా లేదని అదే ఏడాది కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్‌లో కేసీఆర్ స్వయంగా వెల్లడించారని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సున్నా ఎకరాల నుంచి వేల కోట్ల ఆస్తులకు ఎదిగిన **మిగతా 2లో...**

కారుమూరి రిమాండ్ పొడిగింపు

ఏపీ మద్యం రవాణా కుంభకోణం..

కారుమూరిని విజయవాడ ప్రత్యేక కోర్టుకు తీసుకొచ్చిన ఈడీ అధికారులు

హవాలా మార్గంలో రూ. 15 కోట్లు కారుమూరికి చేరినట్లు ఆధారాలు



అమరావతి, సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)

మద్యం రవాణా స్కామ్ కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనను... ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు**మిగతా 2లో...**

జేఈఈ మెయిన్-2027 తేదీలు వచ్చేశాయి!

వచ్చే ఏడాది రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణ

జనవరి 22 నుంచి తొలి విడత పరీక్షలు

ఏప్రిల్ లో సెకండ్ సెషన్ పరీక్షలు

అక్టోబర్ 2026లో ప్రారంభం కానున్న రిజిస్ట్రేషన్లు

యూజీసీ నెట్, క్యూయెట్ పీజీ తేదీలు కూడా ఖరారు

2లో.

రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం

: కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం

ఈ ఖరీఫ్‌లో సాగు 56.4 లక్షల ఎకరాలకే పరిమితమయిందన్న జగన్

రైతులను నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్



అమరావతి, సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)

ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాల వారీగా పరిస్థితులపై సమీక్ష జరిపారు.**మిగతా 2లో...**

నిరూపిస్తే రాసిస్తాం

రేవంత్‌కు కేటీఆర్ ఛాలెంజ్

933 ఎకరాలు ఉన్నట్లు నిరూపిస్తే రాసిస్తాం..

సిట్టింగ్ జడ్జితో విచారణకు కేటీఆర్ సవాల్

కేసీఆర్ ఆస్తులపై ఆరోపణలను ఖండించిన కేటీఆర్

67 ఎకరాల భూమిపై కేటీఆర్ వివరణ

రేవంత్ ఆస్తులపైనా కేటీఆర్ ప్రశ్నలు




హైదరాబాద్ సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)

మాజీ సీఎం కేసీఆర్ ఆస్తులపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వానికి దమ్ముంటే కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని అన్నారు.గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. అసెంబ్లీలో కేసీఆర్ కుటుంబ సభ్యుల భూములపై రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను**మిగతా 2లో...**

మెడికల్ షాపుల్లో సీసీటీవీ నిఘాలోనే మందులు..

కేంద్రం కొత్త ప్రతిపాదనలు



డీజే వాహనాలను అడ్డుకోవద్దు

వినాయక నిమజ్జనంలో డీజేలకు అనుమతులు ఇవ్వాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి

ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని హోంమంత్రి, డీజీపీని కోరిన మంత్రి



అమరావతి, సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)

ఆంధ్రప్రదేశ్‌లో వినాయక నిమజ్జన కార్యక్రమాలకు సంబంధించి డీజే వాహనాల అనుమతులపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఉత్సవాల సందర్భంగా డీజే వాహనాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అనుమతులు మంజూరు చేయాలని ఆయన హోంమంత్రి అనిత, డీజీపీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన **మిగతా 2లో...**

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

ఇంధన భద్రతకే ప్రాధాన్యం

మొదటిపేజీ తరువాయి

సంతరించుకుంది.

అమెరికన్ కాంగ్రెస్‌లో రిపబ్లికన్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంటల్ మాట్లాడుతూ.. "భారత్, చైనాలకు మా సందేశం ఒక్కటే. మీ పద్ధతి మార్చుకోండి. మీకు కావాల్సిన చమురు, గ్యాస్‌ను వేరే దేశాల నుంచి కొనండి. బుజ్జగింపులు సరైన వ్యూహం కాదు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ కొత్త ఆంక్షల ద్వారా రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను చర్చల వైపు నెట్టి, ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "పుతిన్, మా దగ్గర నీ నంబర్ ఉంది. ఉక్రెయిన్.. మీరు ఒంటరి కాదు" అని ఆయన అన్నారు.

ఏమిటీ కొత్త చట్టం?

'లిండ్సే ఓ గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026' పేరుతో రూపొందించిన ఈ చట్టం, రష్యా అధికారులు, బ్యాంకులు, అలాగే రష్యా ఇంధనాన్ని ప్రపంచవ్యాప్తంగా రవాణా చేస్తున్న 'షాడో ఫ్లీట్' (రహస్య ట్యాంకర్ల వ్యవస్థ)పై కఠిన ఆంక్షలు విధిస్తుంది. ఈ చట్టం ప్రకారం, రష్యా నుంచి అత్యధికంగా చమురు, గ్యాస్ దిగుమతి చేసుకుంటున్న మొదటి ఐదు దేశాలపై 100శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కట్టబెడుతుంది. ఈ జాబితాలో భారత్, చైనాలు ప్రధానంగా ఉన్నాయి.

అయితే, రష్యా గ్యాస్ ఎగుమతుల్లో 15శాతం కంటే తక్కువ దిగుమతి చేసుకుంటూ, వాటిని తగ్గించడానికి గణనీయమైన చర్యలు తీసుకున్న దేశాలకు మినహాయింపు ఇచ్చారు. ఈ బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభలో 262-159 ఓట్ల తేడాతో ఆమోదం లభించింది. ప్రస్తుతం ఇది అధ్యక్షుడు ట్రంప్ సంతకం కోసం వేచి ఉంది.

గట్టిగా బదులిచ్చిన భారత్

అమెరికా హెచ్చరికలపై భారత ప్రభుత్వం తీవ్రంగా, స్పష్టంగా స్పందించింది. తమ దేశ ప్రజల ఇంధన భద్రతకు కట్టుబడి ఉన్నామని, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వివిధ దేశాల నుంచి ఇంధన సరఫరాలను కొనసాగిస్తామని స్పష్టం చేసింది. అమెరికా తీసుకుంటున్న ఇలాంటి చర్యలు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీస్తాయని తాము ముందుగానే వాషింగ్టన్‌ను హెచ్చరించినట్లు న్యూఢిల్లీ పేర్కొంది.ఈ బిల్లు ఆమోదాన్ని గమనించామని, దీనివల్ల ద్వైపాక్షిక సంబంధాలపై, అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై పడే ప్రభావం గురించి గత కొన్ని నెలలుగా అమెరికన్ అధికారులతో జరిగిన చర్చల్లో చాలా స్పష్టంగా వివరించామని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. "భారత వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని" కూడా ఆ ప్రకటనలో ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలోని వాణిజ్య, పారిశ్రామిక సంస్థలతో కలిసి ఈ చట్టం వల్ల కలిగే పరిణామాలను ఎదుర్కొంటామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

తమ భారీ జనాభా, ఆర్థిక వ్యవస్థ అవసరాల దృష్ట్యా సురక్షితమైన, సరసమైన, నమ్మకమైన ఇంధన సరఫరాలు అత్యవసరమని భారత్ తన వైఖరిని పునరుద్ఘాటించింది.

సెమీకండక్టర్ రంగంలో దూకుడు..

మొదటిపేజీ తరువాయి

కీలక రంగాల్లో చోటుచేసుకుంటున్న అభివృద్ధి దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గురువారం సెమీకాన్ ఇండియా 2026 కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ప్రధాని ప్రసంగించారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "ప్రపంచం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ, ఇటీవలి త్రైమాసికంలో భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధిని నమోదు చేసింది. ఇది మన ఆర్థిక వ్యవస్థ స్థితిస్థాపకతను చూపుతోంది. గడిచిన 15 రోజుల్లో జరిగిన పరిణామాలే దీనికి ఉదాహరణ" అని తెలిపారు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో ఏజెంటిక్ ఏఐ, టోకెనైజేషన్, క్వాంటం టెక్నాలజీ వంటి అంశాలపై చర్చ జరిగిందని, అలాగే దేశవ్యాప్తంగా దాదాపు 3,000 కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు కార్యకలాపాలు ప్రారంభించాయని గుర్తుచేశారు. ఈ కారిడార్లు దేశంలో సరుకు రవాణాను వేగవంతం చేసి, లాజిస్టిక్స్ రంగాన్ని మెరుగుపరచడమే కాకుండా తయారీ రంగానికి కొత్త ఊపు ఇస్తాయని వివరించారు.సెమీకండక్టర్ రంగం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. "భారత చిప్ పరిశ్రమ వేగంగా పుంజుకుంటోంది. త్వరలోనే 'భారత్ చిప్స్ ప్రపంచానికి వెళ్తాయి' అన్నది వాస్తవరూపం దాల్చనుంది" అని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవలే ఒక ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ భారత్‌కు సావరిన్ రేటింగ్ అప్‌గ్రేడ్ ఇవ్వడం కూడా భారత ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న ప్రపంచ విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. భారత్ అధ్యక్షతన జరిగిన బ్రిక్స్ సదస్సులో ఏకాభిప్రాయంతో న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించడం కూడా అంతర్జాతీయంగా మన దేశానికి ఉన్న ఆమోదాన్ని స్పష్టం చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. 'సెమీకాన్ 2.0' కార్యక్రమం ద్వారా దేశంలో సెమీకండక్టర్ల పర్యావరణ వ్యవస్థను ఆరు కీలక స్తంభాలపై నిర్మిస్తున్నామని తెలిపారు. చిప్ డిజైన్, యంత్రాలు-ముడి పదార్థాలు, ఫ్యాబ్‌లు, అడ్వాన్స్‌డ్ ప్యాకేజింగ్, నైపుణ్యాభివృద్ధి ఇందులో భాగమని వివరించారు.సెమీకండక్టర్ కార్యక్రమంలో భాగంగా తొలి దశలో 105కు పైగా స్టార్టప్‌లు పాల్గొన్నాయని, వాటిలో 20 స్టార్టప్‌లు వెంచర్ క్యాపిటల్ ఫండింగ్ ద్వారా రూ.800 కోట్ల నిధులను సమీకరించాయని మంత్రి వెల్లడించారు. సెమీకాన్ 2.0 కింద కనీసం 200 చిప్-డిజైన్ స్టార్టప్‌లు, కంపెనీలకు మద్దతు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. పదేళ్లలో 85,000 మంది డిజైన్ ఇంజనీర్లను తయారు చేయాలని లక్ష్యం పెట్టుకోగా, కేవలం నాలుగేళ్లలోనే 70,000 మందికి శిక్షణ పూర్తి చేశామని ఆయన సగర్వంగా ప్రకటించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 400కు పైగా యూనివర్సిటీలకు ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ (ఈడీఏ) టూల్స్ అందుబాటులో ఉన్నాయని మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

మెడికల్ షాపుల్లో సీసీటీవీ నిఘాలోనే మందులు.

- కేంద్రం కొత్త ప్రతిపాదనలు

డాక్టర్ల సిఫార్సుతో విక్రయించే మందులపై కేంద్రం మరింత కఠిన నిఘాకు సిద్ధమవుతోంది. మందుల దుకాణాలు, ఇతర లైసెన్స్ పొందిన రిటైల్ కేంద్రాల్లో ప్రిస్క్రిప్షన్ ఆధారంగా మందులు విక్రయించే సమయంలో సీసీ కెమెరా నిఘా తప్పనిసరి చేసే ప్రతిపాదనను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తీసుకొచ్చింది.

సెప్టెంబర్ 8న జారీ చేసిన ముసాయిదా నోటిఫికేషన్ ప్రకారం.. రిజిస్టర్డ్ వైద్యుడు సూచించిన ఏదైనా మందును హోల్‌సేల్ విక్రయాలు మినహా ఇతర మార్గాల్లో సరఫరా చేసే సమయంలో లైసెన్స్ పొందిన ప్రాంగణంలో సీసీటీవీ వ్యవస్థ పనిచేస్తూ ఉండాలి. మందు విక్రయం జరిగిందని ధ్రువీకరించుకునేలా రికార్డింగ్ ఉండాలి. ఈ దృశ్యాలను కనీసం మూడు నెలల పాటు భద్రపరచాలని ప్రతిపాదించారు.

ప్రిస్క్రిప్షన్ అవసరమైన మందులను కొన్ని చోట్ల సరైన వైద్య సూచన లేకుండానే విక్రయిస్తున్నారన్న ఆందోళనల నేపథ్యంలో ఈ ప్రతిపాదన వచ్చింది. మందుల విక్రయంలో బాధ్యతను పెంచడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన సందర్భాల్లో అధికారులు తనిఖీ చేసేందుకు ఈ రికార్డులు ఉపయోగపడే అవకాశం ఉంది.

ఈ నిబంధన షెడ్యూల్ హెచ్, హెచ్1, ఎక్స్ మందులకే పరిమితం కాదు. వైద్యుడి ప్రిస్క్రిప్షన్‌తో సరఫరా చేసే మందులన్నింటికీ వర్తించేలా ముసాయిదాలో పేర్కొన్నారు. అయితే హోల్‌సేల్ వ్యాపారులకు మాత్రం ఈ నిబంధన నుంచి మినహాయింపు ఉంటుంది.

ఇటీవల దగ్గు సిరప్‌ల విక్రయాలపై నిబంధనలు కఠినతరం చేసిన నేపథ్యంలో తాజా ప్రతిపాదన ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా పిల్లలు, పెద్దలకు ఉద్దేశించిన కొన్ని మందులు సరైన వైద్య పర్యవేక్షణ లేకుండా ఇవ్వడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వయసు, ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా మందు, మోతాదు నిర్ణయించాల్సిన అవసరం ఉండటంతో ఈ అంశంపై కేంద్రం దృష్టి సారించింది.అయితే సీసీటీవీ నిబంధన ఇంకా అమల్లోకి రాలేదు. ఇది కేవలం ముసాయిదా మాత్రమే. ప్రతిపాదనపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించిన తర్వాత కేంద్రం తుది నిర్ణయం తీసుకోనుంది. గెజిట్‌లో తుది నిబంధనలు ప్రచురించినప్పుడు ప్రభుత్వం పేర్కొనే తేదీ నుంచి మాత్రమే కొత్త నిబంధన అమల్లోకి వస్తుంది.



రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం

ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.

ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు.

సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసీపీ క్షేత్రస్థాయి కార్యాచరణ చేపడుతుందని, త్వరలోనే తాను స్వయంగా కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి పరుగులు

మొదటిపేజీ తరువాయి

ఈ మంత్రంతో దేశం అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది.

వీ అంటే వడ్‌నగర్.. కే అంటే కాశీ.. ఎస్ అంటే సెప్టెంబరు' అని చెప్పారు. ఎన్‌డీఏ ఐక్యతే దేశానికి బలమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం పెద్దఎత్తున సాయం అందిస్తోందన్నారు. అమరావతి, పోలవరం వంటి ప్రాజెక్టులకు ఇస్తున్న మద్దతును రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరువలేరని తెలిపారు. దేశంలో భిన్న సంస్కృతులు, భిన్న భాషలు ఉన్నా.. దేశాభివృద్ధి, ఆత్మనిర్భరతే మన లక్ష్యమన్నారు. సుస్థిరత వల్లే ఇది సాధ్యమవుతుందని స్పష్టంచేశారు.మోదీ ప్రభుత్వ విజయాలను చంద్రబాబు వివరించారు. 25 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారని.. 80 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందుతున్నాయని చెప్పారు. 'జల్‌జీవన్ మిషన్, అమృత్ వంటి పథకాల ద్వారా 4 కోట్ల ఇళ్లకు తాగునీటి సౌకర్యం కల్పించారు. ఇవి అంకెలు మాత్రమే కాదు.. వీటి వెనుక పేద, మధ్య తరగతి కుటుంబాల అభివృద్ధి-సంక్షేమం ఉంది. పీఎం కిసాన్ కింద 11 కోట్ల మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. ఇందులో ఎలాంటి మధ్యవర్తులూ లేరు. నేరుగా రైతుల ఖాతాలకే నగదు జమ చేస్తున్నారు' అని తెలిపారు. ప్రపంచంలో వివిధ దేశాలు సంక్షోభంలో కూరుకుపోతున్న వేళ నరేంద్ర మోదీ దేశానికి మంచి నాయకత్వం అందించారని.. ఆత్మనిర్భర్ భారత్, వోకల్ ఫర్ గ్లోబల్ విధానాలతో మేకిన్ ఇండియా కాన్‌ఫిడెన్స్‌ను బలోపేతం చేశారని ప్రశంసించారు. 'గతంలో రక్షణ పరికరాలను దిగుమతి చేసుకునేవాళ్లం, ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి చేరాం. టెక్నాలజీని పూర్తి స్థాయిలో అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీయే. మహిళా సంక్షేమం, సాధికారత కోసం ఆయన కృషి అపూర్వం.. బేటీ బచావో-బేటీ పడావో, లఖ్‌పతి దీదీ స్కీంలు ఇందుకు నిదర్శనం. ఉజ్వల పథకం ద్వారా క్లీన్ ఫ్యూయల్‌ను ప్రోత్సహిస్తున్నారు. ముద్ర పథకం పెట్టుబడులు సమకూరుస్తోంది. స్వయం సహాయక సంఘాలు నమ్మకాన్ని పెంచుతున్నాయి. నారీశక్తి అధినియం ద్వారా చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వబోతున్నారు. ఇది గేమ్ చేంజర్ కాబోతోంది' అని చెప్పారు.

దేశం మొత్తానికి ఒకే పవర్ గ్రిడ్ ఏర్పాటు చేసిన ఘనత మోదీదేనని సీఎం పేర్కొన్నారు. 'దేశం నలుమూలలకూ కనెక్టివిటీ పెంచారు. వందే భారత్ రైళ్లను ప్రారంభించారు.. బుల్లెట్ ట్రైన్లు రాబోతున్నాయి. నదుల అనుసంధానం మాత్రం పెండింగ్‌లో ఉంది.. ఇది కూడా మోదీ ద్వారానే సాధ్యమవుతుంది. బ్రహ్మపుత్ర, గంగ, మహానది, కావేరి, గోదావరి నదులను అనుసంధానం చేస్తే దేశానికి తిరుగుండదు. మోదీ సారథ్యంలో అభివృద్ధి పట్టణాలకే కాదు.. గ్రామీణ ప్రాంతాలకూ చేరింది' అని తెలిపారు. ప్రపంచం ముందు భారత్‌ను తిరుగులేని శక్తిగా నిలబెట్టిన ఘనత మోదీదేనన్నారు. ఎవరైనా మన దేశంపై దాడి చేయాలంటే భయపడేలా చేశారని తెలిపారు. 'నేను కూడా నక్సలిజాన్ని ఎదుర్కొన్నాను.. నన్ను నక్సలైట్లు టార్గెట్ చేశారు.. కానీ ఇప్పుడు దేశంలో నక్సలిజం, మావోయిజం అనేదే లేకుండా చేశారు. దటీజ్ నరేంద్ర మోదీ.' అని చెప్పారు.

కాశీ విశ్వనాథుడికి ప్రత్యేక పూజలు

కాశీవిశ్వనాథుడిని చంద్రబాబు దర్శించుకున్నారు. యోగి ఆదిత్యనాథ్, రాజ్‌నాథ్, చిరాగ్ పాసవాన్‌తో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వనాథుడిని పవిత్ర జలాలతో అభిషేకించారు. అర్చకులు ఆశీర్వదించి.. తీర్థప్రసాదాలు అందించారు. కేంద్ర మంత్రులు, యూపీ సీఎంతో కలిసి ఆలయ ప్రాంగణంలోని భక్తులకు సీఎం ప్రసాదం పంచారు. ఆయన వెంట ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సానా సతీశ్ ఉన్నారు.



నిరూపిస్తే రాసిస్తాం

మొదటిపేజీ తరువాయి

ఆయన ఖండించారు. కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ఇన్నాళ్లూ ప్రచారం చేసి.. అసెంబ్లీలో మాత్రం 67 ఎకరాలు ఉన్నట్లు సీఎం చెప్పారని కేటీఆర్ అన్నారు. తప్పుడు ప్రచారం చేసినందుకు రేవంత్‌రెడ్డి కేసీఆర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్‌కు 933 ఎకరాల భూమి ఉందని ప్రభుత్వం నిరూపిస్తే ఆ భూములను రాసిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ కుటుంబ ఆస్తులపై పుట్టుపూర్వోత్తరాలతో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు.కేసీఆర్ భూస్వామ్య కుటుంబంలో పుట్టారని, తమ తాతకు వందల ఎకరాల భూమి ఉండేదని కేటీఆర్ చెప్పారు. ఇప్పుడు 67 ఎకరాలు ఉండటం తప్పా? అని ప్రశ్నించారు.

ఇదే సమయంలో రేవంత్‌రెడ్డి ఆస్తులపైనా కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. తాను అమెరికాలో ఉద్యోగం చేసి సంపాదించుకున్నానని చెబుతున్నా.. రేవంత్‌రెడ్డికి జూబ్లీహిల్స్‌లో ప్యాలెస్ లాంటి ఇల్లు, ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఆయన తమ్ముళ్లు ఏరోస్పేస్ కంపెనీలు ఎలా ఏర్పాటు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం అయ్యాక ఆయన చిన్నాన్న ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో వివరించాలని కోరారు.రేవంత్‌రెడ్డి తమ పార్టీ నేతలపై ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ప్రతి పథకంలోనూ స్కామ్ ఉంటోందని ఆరోపించారు.

వైభవంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం..

తెలంగాణ వ్యాప్తంగా 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ' వేడుకలు సెప్టెంబర్ 17న అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. హైదరాబాద్ నాంపల్లిలోని చారిత్రాత్మక పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ముప్పన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.పబ్లిక్ గార్డెన్స్‌కు చేరుకునే ముందు గన్ పార్క్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని ముఖ్యమంత్రి సందర్శించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల త్యాగాలను స్మరిస్తూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పబ్లిక్ గార్డెన్స్‌లో పోలీసు బలగాల నుంచి రేవంత్ రెడ్డి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రాష్ట్ర ప్రజలకు ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.వేడుకల్లో భాగంగా సీఎం ప్రసంగిస్తూ... ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, స్వేచ్ఛ, సామాజిక న్యాయమే పునాదిగా కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకమైన 'ప్రజా పాలన'ను అందిస్తోందని స్పష్టం చేశారు. పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని, రాష్ట్రాభివృద్ధి, రాష్ట్ర పునర్నిర్మాణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు.రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

జేఈఈ మెయిన్-2027 తేదీలు వచ్చేశాయి!

దేశవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ - 2027 షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసింది. విద్యార్థుల సౌలభ్యం కోసం పరీక్షల తేదీలను ముందుస్తుగానే ప్రకటించింది. వచ్చే ఏడాది కూడా ఈ పరీక్షలను రెండు విడతల్లో నిర్వహించనున్నట్లు ఎన్‌టీఏ స్పష్టం చేసింది.

జేఈఈ మెయిన్ - 2027 మొదటి విడత పరీక్షలు జనవరి 22, 23, 24, 28, 29, 30 తేదీల్లో జరగనున్నాయి. ఏప్రిల్ నెలలో నిర్వహించే రెండో విడత పరీక్షా తేదీలను ఎన్‌టీఏ ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఈ పరీక్షలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ 2026 అక్టోబర్ నెలలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని సమాచారం.జేఈఈ మెయిన్‌తో పాటు మరికొన్ని కీలక పరీక్షల తేదీలను కూడా ఎన్‌టీఏ వెల్లడించింది. దీని ప్రకారం, యూజీసీ నెట్ పరీక్షను 2026 డిసెంబర్ 14 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అలాగే, కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ - 2027 పరీక్షలను మార్చి 1 నుంచి 5, 8, 12 నుంచి 20, 24, 25 తేదీల్లో జరపనున్నట్లు తెలిపింది. పరీక్షల తేదీలను ముందుగానే ప్రకటించడం వల్ల విద్యార్థులు తమ సన్నద్ధతను మరింత ప్రణాళికాబద్ధంగా కొనసాగించేందుకు వీలవుతుంది.

కారుమూరి రిమాండ్ పొడిగింపు

మొదటిపేజీ తరువాయి

పీటీ వారెంట్‌పై విజయవాడ ప్రత్యేక కోర్టుకు తీసుకువచ్చారు. విచారణ అనంతరం ఆయన రిమాండ్ ను న్యాయస్థానం సెప్టెంబరు 25 వరకు పొడిగించింది.ఈ కేసు విషయానికొస్తే... (ఈడీ నివేదిక ప్రకారం) సాధారణ నిబంధనల మేరకు కిలోమీటర్‌కు రూ. 13 మాత్రమే రవాణా ఛార్జీలుగా చెల్లించాల్సి ఉండగా, టెండర్ల నిబంధనలను అక్రమంగా సవరించి కిలోమీటర్‌కు ఏకంగా రూ. 35 వరకు చెల్లించారు. ఈ అక్రమ మార్పుల కారణంగా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 195.33 కోట్ల మేర భారీ నష్టం వాటిల్లినట్లు దర్యాప్తు సంస్థ ప్రాథమికంగా లెక్కగట్టింది.కారుమూరి నాగేశ్వరరావు పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలో తన అధికారిక హోదాను దుర్వినియోగం చేస్తూ తన కుమారుడు, వ్యాపార భాగస్వాములకు మద్యం రవాణా సబ్‌కాంట్రాక్టులు దక్కేలా చక్రం తిప్పారని దర్యాప్తులో నిర్ధారణ అయింది. ఈ వ్యవహారంలో హవాలా మార్గంలో దాదాపు రూ. 15 కోట్లు కారుమూరికి చేరినట్లు ఆధారాలు సేకరించిన అధికారులు, ఇప్పటివరకు ఆయన కుటుంబానికి చెందిన రూ. 87.7 కోట్ల విలువైన ఆస్తులను తాత్కాలికంగా జప్తు చేశారు.ఈ కేసులో ఇప్పటికే కారుమూరి కుమారుడు సునీల్ కుమార్, ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, డిజిటల్ నెట్‌వర్క్ అధినేత కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిలను ఈడీ అరెస్ట్ చేసి విచారిస్తోంది.

డీజే వాహనాలను అడ్డుకోవద్దు

మొదటిపేజీ తరువాయి

విడుదల చేశారు.వినాయక నిమజ్జనం కోసం ఏర్పాటు చేస్తున్న డీజే వాహనాలకు పోలీసులు అనుమతులు ఇవ్వడం లేదని పలువురు తన దృష్టికి తీసుకొచ్చారని లోకేశ్ తెలిపారు. ప్రజల నుంచి ఈ విషయంపై తనకు అనేక సందేశాలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకునే ఈ ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ఈ నేపథ్యంలో రాష్ట్ర హోంమంత్రి అనిత, డీజీపీ వెంటనే జోక్యం చేసుకోవాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. డీజే వాహనాలకు అనుమతులు ఇచ్చే ప్రక్రియను సులభతరం చేయాలని, ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా క్లియరెన్సులు ఇవ్వాలని కోరారు. నిమజ్జనం సందర్భంగా రాష్ట్రంలో ఒక్క డీజే వాహనాన్ని కూడా పోలీసులు సీజ్ చేయకూడదని ఆయన స్పష్టంగా సూచించారు. ప్రజలు ప్రశాంతంగా, ఆనందంగా పండుగను జరుపుకునే వాతావరణం కల్పించాలని ఆయన పోలీసు శాఖకు విజ్ఞప్తి చేశారు.

2004 వరకు కేసీఆర్‌కు ఎకరా భూమి లేదు

మొదటిపేజీ తరువాయి

భూబకాసురుడు కేసీఆర్ అని గురువారం ఎక్స్ వేదికగా మంత్రి మండిపడ్డారు. ఎకరా భూమి కూడా లేదని తెలిపిన కేసీఆర్‌కు.. ఇప్పుడు 440 ఎకరాలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తర్వాత అధికారంలోకి వచ్చాక పదేళ్ల పాలనలో కేసీఆర్ భూములు భారీగా పెరిగాయని 2004 నాటి ఆయన ఎన్నికల అఫిడవిట్ స్పష్టం చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్ కుటుంబానికి రూ.కోట్ల ఆస్తులు సమకూరితే.. తెలంగాణ ఉద్యమకారులకు అప్పులు మిగిలాయన్నారు.ఇవాళ కేసీఆర్ వద్ద రూ.వందల కోట్ల ఆస్తులు ఉన్నాయంటే పేదలు, దళితుల అసైన్డ్ భూములను దోచుకోవడం వల్లనే సాధ్యమైందని మంత్రి పొంగులేటి విమర్శించారు. ఉద్యమకారుల త్యాగాల పునాదుల మీద రూ.లక్ష కోట్ల ఆస్తులను కల్వకుంట్ల కుటుంబం అక్రమంగా సంపాదించిందన్నారు. పుట్టుకతోనే కేసీఆర్‌కు వందల ఎకరాలు ఉన్నాయని బొంకుతున్న కేటీఆర్.. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో వాటిని ఎందుకు చూపలేదు... అంటే ఎన్నికల సంఘానికి తప్పుడు సమాచారం ఇచ్చారా..? ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారా అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబానికి 9 జిల్లాల్లో, 24 మండలాల్లో, 31 గ్రామాల్లో 440 ఎకరాల భూమి ఉందని, ఇదంతా ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి బుధవారం శాసనసభలో ప్రశ్నించారని... ఇదే కాకుండా బినామీల పేరుతోనూ వందల ఎకరాలు దోచుకున్నారని, రాష్ట్రాన్ని దోపిడీ చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.కేటీఆర్, ఆయన భార్య, పిల్లల పేరుతో ఎర్రవల్లి, జన్వాడ, మర్కూక్, వెంకటాపూర్ పరిధిలో 123.19 ఎకరాలు ఉందన్నారు. అయితే 2009 ఎన్నికల సమయంలో కేటీఆర్

దేవన కొండ మండలం ను కరవు గా ప్రకటించి రైతులను, మండల ప్రజానీకాన్ని ఆదుకోవాలి... సిపిఎం

దేవనకొండ సెప్టెంబర్ 17 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-



దేవనకొండ మండలాన్ని కరువుగా ప్రకటించి వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని, రైతులని, వ్యవసాయ కూలీల ను ఆదుకోవాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు ముక్కెళ్ల అశోక్ , యూసుఫ్ బాషా లు జిల్లా జాయింట్ కలెక్టర్గారికి వినతి పత్రం అందజేశారు.మండలంలో ప్రజానికం ఈ సంవత్సరం తీవ్రమైన కరువును చవి చూస్తుందని ఖరీఫ్ సీజన్ లో వర్ష బావ పరిస్థితిలు ప్రజలను తీవ్రంగా కరువులోకి నెట్టేసేయని కరువు ఖరాల నృత్యం కోలుకోలేని విధంగా ఉందని ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదికన కరువు సహాయక చర్యలు చేపట్టాలని వారు జాయింట్ కలెక్టర్ గారికి వినతిపత్రం అందజేస్తూ కోరారు ఈ ఖరీఫ్ సీజన్ మొత్తంగా కేవలం రెండు సార్లు మాత్రమే వర్షం కురిసిందని వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో రైతులు వేసిన పంటలు చాలా తీవ్రంగా దెబ్బతిన్నాయని ఏ పంట కూడా అడుగు మేర కూడా పెరగడం లేదని దిగుబడి సంగతి చెప్పుకోనవసరం లేదని పేర్కొన్నారు. ఈ సంవత్సరం దారుణమైన కరువు నేపథ్యంలో పెట్టిన పెట్టుబడులు కూడా భూమిలో పాతర వేసిన విధంగా భూమిలో కలిసిపోయాయని వేలకు వేల పెట్టుబడులు పెట్టిన రైతు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారనీ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మనవి చేశారు, వెంటనే జిల్లాను, మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి నిర్దిష్టమైన కరువు సహాయక చర్ల చేపట్టాలని వారు మనవి చేశారు..మండలని కరువు మండలంగా ప్రకటించాలినీ, పంట నష్టంగాఎకరాకు 50 వేల పరిహారం, అదేవిధంగా వ్యవసాయ రుణాల మాఫీ చేయాలని వలసల నివారణకు అడిగిన వారందరికీ ఉపాధి పని కల్పించాలనిప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యవసర సరుకులు వస్తువులను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయాలని,పశువులకు ప్రసుగ్రాసం అందజేయాలని,రైతులు భారీగా నష్టపోయిన నేపథ్యంలో ఎరువులు విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలని జిల్లాలో పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని,కరువు వలన కౌలు రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారని కౌలు రైతు ను ఆదుకోవాలనీ,పంటల బీమా ను అందరికీ వర్తింప చేయాలని వారు కోరారు

పల్లెదొడ్డిలో మారెమ్మ అవ్వ నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం

భక్తిశ్రద్ధల మధ్య పునాది పనులకు ప్రారంభం -గ్రామ ప్రజల సమక్షంలో ఘనంగా కార్యక్రమం

మారెమ్మ అవ్వ ఆశీస్సులు గ్రామంపై నిండుగా ఉండాలని ఆకాంక్ష



దేవనకొండ, సెప్టెంబర్ 17(ప్రజా రిపబ్లిక్ న్యూస్):-దేవనకొండ మండలం పల్లెదొడ్డి గ్రామ పొలిమేర సరిహద్దు ప్రాంతంలో శ్రీ పల్లెదొడ్డి మారెమ్మ అవ్వ నూతన ఆలయ నిర్మాణానికి గురువారం గ్రామ ప్రజలు, భక్తాదుల సమక్షంలో పునాది పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఆలయ నిర్మాణానికి పునాది తీయడం ప్రారంభించారు. నూతన ఆలయ నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా పూర్తికావాలని, శ్రీ మారెమ్మ అవ్వ ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని గ్రామస్తులు మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఆలయ నిర్మాణం పూర్తయిన అనంతరం గ్రామంలో భక్తి వాతావరణం మరింత పెరుగుతుందని, మారెమ్మ అవ్వ ఆలయం గ్రామానికి ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పల్లెదొడ్డి గ్రామ ప్రజలు, భక్తాదులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా సేవ సంకల్ప అభయాన్ కార్యక్రమము

ఆళ్లగడ్డ సెప్టెంబర్ 17 రిపబ్లిక్ న్యూస్



ఆళ్లగడ్డ తాలూకా సిరువెళ్ల మండల కేంద్రం లోని స్థానిక ఆసుపత్రి యందు డాక్టర్ ముకేశ్ మరియు డాక్టర్ ఆంజనేయ నాయక్ నేతృత్వంలో సేవా సంకల్ప అభయాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా సేవా సంకల్ప కార్యక్రమం రూపుదిద్దుకున్నదని, సమాజంలోని అభాగ్యులకు చేయూత నిందిస్తూ ప్రజలకుఆరోగ్యపరిరక్షణ ,విద్యార్థులకు చేయూత, మహిళా సాధికారికత పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సులు ఈనెల 17 నుండినెలరోజుల పాటునిర్వహిస్తారనితెలిపారు.సమాజంలోని ప్రతి ఒక్కరికి మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం అని తెలిపారు.తదనంతరము సిబ్బందిచే సేవా సంకల్ప కార్యక్రమం పై తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ రామ్మోహన్ రెడ్డి పిహెచ్ఎన్ సరస్వతి సూపర్వైజర్ రవి కిషోర్ ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి మహోత్సవం





ఆళ్లగడ్డ సెప్టెంబర్ 17 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ పట్టణం లోని శ్రీ శ్రీ శ్రీ కాళికాదేవి ఆలయంలో శ్రీ విరాట్ విశ్వకర్మ భగవానుడు యజ్ఞమహోత్సవం జయంతి సందర్భంగా విశ్వకర్మ భగవానుడు చిత్రపటానికి పుష్పాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు భక్తులందరు భగవానుడిని భక్తి శ్రద్ధలతో స్మరించుకున్నారు. సమాజ నిర్మాణంలో ఎంతో కీలకమైన శిల్పులు, వృత్తి నిపుణులు, కార్మికులు విశ్వకర్మ జయంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

దేవనకొండలో ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

పాలాభిషేకం.. కేక్ కట్ చేసి సంబరాలు -దేశ ప్రగతికి మోదీ నాయకత్వం దిశానిర్దేశం



దేవనకొండ, సెప్టెంబర్ 17(ప్రజా రిపబ్లిక్ న్యూస్):-

దేవనకొండ గ్రామపంచాయతీ ఆవరణలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదిన వేడుకలను కూటమి నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బీజేపీ ఆలూరు ఇంచార్జ్ తిమ్మప్ప, టీడీపీ దేవనకొండ సీనియర్ నాయకులు బడిగింజల రంగన్న, జనసేన నాయకులు ఎ. ఉచ్చురప్ప, బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. దేశంలో శాంతి, భద్రతతో కూడిన పాలనతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు.స్వచ్ఛ భారత్, బేటీ బచావోబేటీ పడావో, డిజిటల్ ఇండియా, ముద్ర యోజన వంటి కార్యక్రమాలతో ప్రజలకు వివిధ రంగాల్లో అవకాశాలు పెరిగాయని తెలిపారు. రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, వందే భారత్ రైళ్లు, రహదారుల విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధి వంటి కార్యక్రమాలు దేశ ప్రగతికి దోహదపడుతున్నాయని వివరించారు.అంతరిక్ష పరిశోధనలు, శాస్త్ర సాంకేతిక రంగం, రక్షణ రంగంలో స్వయం సమృద్ధి దిశగా భారత్ అడుగులు వేస్తోందన్నారు. దేశ భద్రత, ఆహార భరోసా, మౌలిక వసతులు, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ వంటి అంశాల్లోనూ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు.భారతదేశ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు, కళా వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా దేశ ప్రతిష్ట మరింత పెరగాలని ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీకి



ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని, దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని వక్తలు ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఆలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బోయ సరోజ, కూటమి నాయకులు రామాంజనేయులు, నందు, తిప్పన్న, పరమేష్, బంగిబాలు, బద్రి, వీఎచ్పీ నాయకులు భీమేష్, శ్రీనివాస్ యాదవ్, మల్లికార్జున్ రెడ్డి, శివాజీ రావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల చిన్నారికి పింఛన్ ఆపొద్దు..

ప్రభుత్వానికి తల్లిదండ్రుల వేడుకోలు

బతకడమే కష్టంగా ఉంది.. చిన్నారి సంరక్షణకు పింఛన్ ఇవ్వండి -తాత్కాలిక ధ్రువపత్రంతో పింఛన్ ఎందుకు నిలిపివేయాలి..

దేవనకొండ సెప్టెంబరు 17(ప్రజా రిపబ్లిక్ న్యూస్):-



మండలానికి చెందిన నిరుపేద కుటుంబం తమ మూడేళ్ల కుమార్తెకు వికలాంగుల పింఛన్ అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటోంది.దేవనకొండకు చెందిన ఒక నిరుపేద కుటుంబానికి బోయ జాన్విక అనే మూడేళ్ల కుమార్తె ఉంది. పుట్టినప్పటి నుంచే చిన్నారికి ఫిట్స్ రావడంతో మెదడుకు తీవ్ర నష్టం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం జాన్వికకు ఎలాంటి శారీరక అభివృద్ధి లేకపోవడంతో పాటు చేతులు, కాళ్లు పనిచేయడం లేదని, మాటలు కూడా రావడం లేదని వాపోయారు.కుటుంబ పరిస్థితి దయనీయంగా ఉన్నప్పటికీ చిన్నారిని చూసుకోవడం తమ బాధ్యతగా భావిస్తూ జీవిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న నెలవారీ పింఛన్ వంటి సహాయం తమ కుమార్తె వైద్య, సంరక్షణ అవసరాలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో చిన్నారికి సదరం ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసుకోగా 100 శాతం వికలాంగత్వం ఉన్నట్లు ధ్రువీకరించారని, అయితే తాత్కాలిక ధ్రువపత్రం జారీ చేశారని తెలిపారు. ఆ ధ్రువపత్రంతో వికలాంగుల పింఛన్కు దరఖాస్తు చేసుకునే సమయంలో అది చెల్లుబాటు కాదని చూపిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
తాత్కాలిక ధ్రువపత్రం కాలపరిమితి ఉన్నంతవరకైనా అర్హులైన చిన్నారులకు పింఛన్ అందించేలా ప్రభుత్వం నిబంధనలను పరిశీలించాలని కోరుతున్నారు. చిన్నారి ఆరోగ్యం మెరుగుపడి సాధారణ జీవితం గడిపే పరిస్థితి వస్తే అంతకంటే ఆనందం తమకు మరొకటి ఉండదని, అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో చిన్నారిని సంరక్షించేందుకు ఆర్థిక సహాయం అత్యవసరమని పేర్కొన్నారు.ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్న వికలాంగ చిన్నారుల కుటుంబాలు అనేకం ఉన్నాయని,



ఐదేళ్లలోపు పిల్లలకు ప్రత్యేక సహాయ పథకాలు అందుబాటులో ఉంటే పేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని విజ్ఞప్తి చేశారు.తాత్కాలిక సదరం ధ్రువపత్రం ఉన్న అర్హులైన వికలాంగ చిన్నారులకు పింఛన్ లేదా ప్రత్యామ్నాయ ఆర్థిక సహాయం అందించేలా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని బాధిత కుటుంబాలు చేతులెత్తి వేడుకుంటున్నాయి.

దేవనకొండలో బీ.సీ బాలుర వసతి గృహా పునఃప్రారంభానికి తక్షణ చర్యలు తీసుకోండి

మండలంలో మోడల్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

దేవనకొండ మండల విద్యారంగ సమస్యలపై జిల్లా జాయింట్ కలెక్టర్ కి వినతిపత్రం అందజేత..

దేవనకొండ సెప్టెంబర్ 17 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-



దేవనకొండ మండల కేంద్రంలో ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని తక్షణమే పునఃప్రారంభించాలని, మండలంలో మోడల్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కె. భాస్కర్ కోరారు. గురువారం దేవనకొండకు వచ్చిన జిల్లా జాయింట్ కలెక్టర్ ని కలిసి ఏఐఎస్ఎఫ్ మండల ప్రతినిధి బృందం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలం నిత్యం కరువు, కాటకాలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. కరువు తో పాటు నిరక్షరాస్యత అధికంగా ఉందన్నారు.ఈ ప్రాంతంలో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని,వెళ్లే సమయంలో వారి పిల్లల చదువులకై ప్రభుత్వ పాఠశాలల్లో వదిలి వెళ్లడం జరుగుతుందని, మండల కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వ్యయప్రయాసలతో వందలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, చదువుకునేందుకు పాఠశాలలు ఉన్నా, ఉండేందుకు వసతి గృహం కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు.మండల కేంద్రంలో గత 40 సంవత్సరాలుగా డి.ఎన్.టి వసతి గృహం ఉండేదని,పక్కా గృహం లేదని, ఇతర కారణాలు చూపి,నిర్వహణ లోపంతో మూసివేయడం జరిగిందన్నారు.వసతి గృహం లేకపోవడంతో విద్యార్థులు టీసి లు తీసుకొని, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని, దీంతో అడ్మిషన్లు కూడా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో బాలికల వసతి గృహం లేకపోవడంతో కర్నూలు, ఆదోని,హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లి బాలికలు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. పలుమార్లు సమస్యలను అధికారులకు విన్నపించినా వాటిని గాలికొదిలేశారని తెలిపారు. దశల వారీ ఉద్యమాల్లో భాగంగా ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఫలితం లేదని తెలిపారు. కావున తమరు తక్షణమే స్పందించి మండల కేంద్రంలో మూసివేసిన బీసీ బాలుర వసతి గృహాన్ని పునఃప్రారంభించి,బీసీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని, మండల కేంద్రంలో ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు మనోజ్, ప్రజాసంఘాల నాయకులు హనుమంతు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలే కూటమి ప్రభుత్వ ధ్యేయం

20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ముందుకు ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 17)




యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. నగరంలోని అబ్బాస్‌నగర్‌లో ఉన్న రవీంద్ర మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 'యువత భవితకు భరోసా' కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ఎంపీ నేరుగా మాట్లాడి, నిరుద్యోగ యువతకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను వివరించారు.
అనంతరం ఎంపీ నాగరాజు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సరైన ఉద్యోగ అవకాశాలు లేక యువత తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఇప్పటికే సుమారు 7 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియామకాలకు, డీఎస్సీ (ఉపాధ్యాయ నియామక పరీక్ష)కు మధ్య ఉన్న తేడా



తెలియని జగన్ డీఎస్సీపై ఆరోపణలు చేస్తున్నారని ఎంపీ విమర్శించారు. ప్రభుత్వం డీఎస్సీ నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని తెలిపారు.కార్యక్రమంలో రవీంద్ర విద్యా సంస్థల అధినేత పుల్లయ్య, కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ లో ఇచ్చిన అర్జీకి స్పందనగా రుద్రవరం కల్వర్టుల, పిల్లకాలువల సైడ్ వాల్స్ ల నివేదిక పంపిన కేసి.కెనాల్ అధికారులు







పాములపాడు సెప్టెంబర్-17 రిపబ్లిక్ న్యూస్:- నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా మండల కేంద్రమైన పాములపాడులో నిర్వహించిన (పి జి ఆర్ ఎస్) ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్.కరీంబాష, రుద్రవరం టిడిపి నాయకుడు రాచపూడి సురేష్ లు ఇచ్చిన అర్జి మేరకు కేసి.కెనాల్ తూము వద్ద కృంగిన పిల్లకాల్వకి సంబంధించిన కల్వర్టు, సైడ్ వాల్ లను కేసి.కెనాల్ ఏఈ శ్రీనివాసులు నాయక్ మరియు కేసి.కెనాల్ వర్క్ ఇన్స్పెక్టర్ జె.నాగేశ్వరుడు లు పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు ఆయకట్టు రైతులకు ఇబ్బందులకు గురి కాకుండా సానుకూలంగా స్పందించి ఉన్నత అధికారుల దృష్టికి కృంగిన సైడ్ వాల్ సమస్యను తీసుకొని వెళ్లగా, వారు కల్వర్టుల పునర్నిర్మాణం కోసం నివేదిక పంపించినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేసి.కెనాల్ టిసి చిన్నబాబుసా, రైతులు మధుసూదన్ రెడ్డి, నాగశేషులు, ప్రేమరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సహాయ నిరాకరణ ఉద్యమం



గుత్తి సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం, వీఆర్ఏ జేఏసీ పిలుపు మేరకు చేపట్టిన సహాయ నిరాకరణ ఉద్యమం గురువారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వీఆర్ఏలు దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా వీఆర్ఏ సంఘం నాయకులు మాట్లాడుతూ.. రాజుల కాలం నుంచి, బ్రిటిష్ పాలనలోనూ గ్రామ రెవెన్యూ సహాయకులుగా సేవలందించినప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రాష్ట్రం ఉమ్మడిగా ఉన్న సమయంలోనూ, రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటినా వీఆర్ఏల సమస్యలకు పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.తమ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని, నామినీలను పర్మినెంట్ వీఆర్ఏలుగా నియమించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వీఆర్ఏలకు ప్రమోషన్లు కల్పించాలని, ప్రమోషన్ల కోటాను 30 శాతం నుంచి 70 శాతానికి పెంచాలని కోరారు. వయసుతో సంబంధం లేకుండా మృతి చెందిన వీఆర్ఏ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.తమ సమస్యల పరిష్కారం కోసం గత ఆగస్టు 19న సీసీఎల్ఏ మంగళగిరి కార్యాలయానికి మెమొరాండం సమర్పించినట్లు తెలిపారు. అనేక దఫాలుగా ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తున్నా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో సహాయ నిరాకరణ ఉద్యమానికి దిగినట్లు పేర్కొన్నారు. ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు తమ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో వీఆర్ఏ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. సుధాకర్, ఉపాధ్యక్షుడు పెద్దన్న, కోశాధికారి రాంప్రసాద్, సలహాదారుల కమిటీ సభ్యులు నారాయణస్వామి, చిరంజీవి, సరస్వతి, క్రమశిక్షణ కమిటీ సభ్యులు సుధాకర్, జగదీష్, యుగంధర్‌తో పాటు వీఆర్ఏలు పాల్గొన్నారు.

పాత, కొత్త నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరి, పూర్వ వైభవం తీసుకురావాలి

:-తేనె నాగరాజు(నియోజవర్గ ఇన్చార్జ్)

స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను తప్పనిసరిగా బరిలో నిలుస్తారు.

2029 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయం





పాములపాడు సెప్టెంబర్ 17 రిపబ్లిక్ న్యూస్:- పాములపాడు లోని, బత్తిని సుదర్శనం సమావేశ భవనంలో మండల అధ్యక్షులు సయ్యద్.షేక్షాఅలి ఆధ్వర్యంలో నందికొట్కూరు నియోజవర్గ ఇంచార్జి తేనే నాగరాజు విలేకరుల సమావేశంలో 2029లో ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వము అధికారంలోకి రావడానికి పెద్ద ఎత్తున పాత, కొత్త నేతలు, నాయకులు, కార్యకర్తలు, యువతీ, యువకులు పార్టీలో చేరాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నందికొట్కూరు నియోజవర్గ ఇన్చార్జి తేనే.నాగరాజు మాట్లాడుతూ కులమతాలకతీతంగా, అన్ని వర్గాలకు, అన్ని రకాల సంక్షేమ పథకాలను అందించి, పేదరిక నిర్మూలనకు విశేషంగా కృషి చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ నుండి మన భారత రాజ్యాంగాన్ని కాపాడడానికి, మతోన్మాదుల నుండి అందరిని రక్షించడానికి యువనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేసి అందరి మనలను పొందడం జరిగిందన్నారు. మన భారతదేశంలో, ఎవరికి అన్యం జరిగినా కూడా మొదట తమ గళాన్ని వినిపించేది, వారికి న్యాయం జరగాలని డిమాండ్ చేసేది మన ప్రియతమ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లే అని అన్నారు. మన దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహానేతల కుటుంబం అది అని కొరియాడారు. నందికొట్కూరు నియోజవర్గంలోని, అన్ని మండలాల గ్రామాలలో త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ తదితర లోకల్ బాడీ ఎలక్షన్ లలో ప్రతి ఒక్క అభ్యర్థులు పోటీ చేసి గెలుపు కోసం 100% ప్రయత్నం చేయాలన్నారు. ప్రతి ఒక్క గ్రామంలో తప్పకుండా పోటీ చేయండనీ, అందుకు మీ మండల అధ్యక్షులు సహకరిస్తారని, తప్పక గెలుపు కోసం కృషి చేయాలని అన్నారు. అన్ని మండలాలలోని, గ్రామాల్లో తప్పకుండా అభ్యర్థులను బరిలో దించాలనీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఒక పక్కన రైతులు వర్షాలు లేక పంట సాగు చేసుకోలేదు పరిస్థితి ఉండే కూడా, ఎరువులు ధరలు పెంచి, రైతు జీవితాలను కేంద్ర ప్రభుత్వం నాశనం చేస్తున్నదని అన్నారు. యూపీఐ మీద కూడా జిఎస్టి విధించి ప్రజల నుండి ముక్కపిండి వసూలు చేయడం జరిగింది. చివరికి పిల్లలు చదువుకునే పెన్ను, పెన్సిన్ కూడా వదలకుండా వసూలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో రైతులకు ఋణ మాఫీ చేసినంతగా ఏ ప్రభుత్వం ఇంతవరకు చేయలేదని పాములపాడు మండల అధ్యక్షులు సయ్యద్.షేక్షాఅలి అన్నారు. ఈ కార్యక్రమంలో జూపాడు బంగ్లా మైనారిటీ అధ్యక్షులు షేక్షావలి, ఉప అధ్యక్షులు షేక్.మసుమ్, ఆర్.రాజు. శ్రీనివాస్, శ్రీనివాసరపాల్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

రూ.2.38 కోట్లతో బీటీ రోడ్డు

భూమిపూజ చేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం

గుత్తి సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)
గుత్తి మండలం మాముడూరు గ్రామం నుంచి జాతీయ రహదారి 44 వరకు రూ.2.38 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు గురువారం స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం భూమిపూజ చేశారు. స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆయన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే జయరాం గ్రామానికి చేరుకోగానే మాముడూరు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని అన్నారు. మాముడూరు నుంచి ఎన్‌హెచ్-44 వరకు రూ.2.38 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. రహదారి నిర్మాణం పూర్తయితే మాముడూరు గ్రామస్థులకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని తెలిపారు.
నియోజకవర్గంలో ఇప్పటికే పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని, రహదారులు, తాగునీరు తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రానున్న రోజుల్లోనూ మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి, వాటిని సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.
రోడ్డు నిర్మాణానికి భూమిపూజ జరగడంతో మాముడూరు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామం నుంచి జాతీయ రహదారికి వెళ్లేందుకు మెరుగైన రహదారి సౌకర్యం అందుబాటులోకి రానుండటంతో ప్రయాణ ఇబ్బందులు తగ్గుతాయని వారు తెలిపారు.
కార్యక్రమంలో డిఈ జ్యోతి, తాసిల్దార్ పుణ్యవతి, జేఈ మల్లేష్ నాయక్, పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రతాప్, మండల అధ్యక్షుడు లక్ష్మి రంగయ్య, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ రమేష్,టీడీపీ సీనియర్ గోవిందు, కోనంకి కృష్ణ,కాంట్రాక్ట్ శ్రీనివాస రెడ్డి,మాజీ సర్పంచ్, యూనిట్ ఇన్‌చార్జి బండి నారాయణస్వామి, బోలె యల్లప్ప, కాలవ సర్పంచ్ జి. శ్రీనివాసులు, జెన్నే మారెన్న స్కూల్ చైర్మన్ అల్లేప్ప, బోయ శ్రీనివాసులు, ఆదినారాయణ, భాస్కర్‌రెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు,అబ్బే దొడ్డి ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణరెడ్డి, పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.





దస్తగిరి మృతదేహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ







ఆళ్లగడ్డ సెప్టెంబర్ 17 రిపబ్లిక్ న్యూస్
ఆళ్లగడ్డ తాలూకా రుద్రవరం మండలం చిలకలూరి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దస్తగిరి మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చిలకలూరు గ్రామానికి చేరుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.దస్తగిరి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.అనంతరం దస్తగిరి కుటుంబానికి రూ.15,000 ఆర్థిక సహాయం అందించి, భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.

కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు

కష్టపడే తత్వం, నైపుణ్యంతో ఏదైనా సాధించవచ్చు: ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణమోహన్





కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 17)
శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతిని పురస్కరించుకుని కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణమోహన్ కార్యక్రమంలో పాల్గొని విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ.. శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్‌ను ప్రపంచంలోనే మొట్టమొదటి వాస్తుశిల్పిగా భావిస్తారని తెలిపారు. కష్టపడే తత్వం, పట్టుదల, నైపుణ్యం ఉంటే ఏదైనా సాధించవచ్చనే శక్తివంతమైన సందేశాన్ని విశ్వకర్మ భగవాన్ జీవితం ద్వారా నేర్చుకోవచ్చన్నారు.సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తూ తమ నైపుణ్యంతో అద్భుతాలను సృష్టిస్తున్న శిల్పులు, చేతివృత్తుల కళాకారులకు విశ్వకర్మ భగవాన్ గొప్ప ప్రేరణగా నిలుస్తారని పేర్కొన్నారు. వివిధ వృత్తుల్లో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ ఆయన స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐలు జావేద్, నారాయణ, పోతల రాజు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వకర్మ భగవాన్ వాస్తు శిల్పం, కళా నైపుణ్యానికి ప్రతీక

వృత్తిదారులు, శిల్పుల శ్రమకు సమాజంలో విశిష్ట గౌరవం కలెక్టర్ డా. ఏ. సిరి







కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 17)
విరాట్ విశ్వకర్మ భగవాన్ వాస్తు శిల్పం, కళా నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తారని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి పేర్కొన్నారు. శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ డా. ఏ. సిరి, అధికారులు, విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు, ప్రతినిధులతో కలిసి విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో నైపుణ్యం కలిగిన వృత్తిదారులు, శిల్పులు, కార్మికుల పాత్ర కీలకమన్నారు. వారి శ్రమ, నైపుణ్యం, సృజనాత్మకతకు సమాజంలో ఎల్లప్పుడూ గౌరవం ఉంటుందని తెలిపారు. సృజనాత్మకత, శిల్ప నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, కష్టపడి పనిచేసే తత్వానికి విశ్వకర్మ భగవాన్ ప్రతీకగా నిలుస్తారని పేర్కొన్నారు.విశ్వకర్మ జయంతి సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్.. ఆయన స్ఫూర్తి వృత్తి నిపుణులు, శిల్పులకు నిరంతరం మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న వృత్తిదారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

విశ్వబ్రాహ్మణ సంఘాల వినతులు

విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు పలు అంశాలపై కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. విశ్వబ్రాహ్మణ దేవాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని, కర్నూలు నగరంలో శ్రీ విశ్వకర్మ విగ్రహం ఏర్పాటుకు స్థలం ఇవ్వాలని కోరారు. అలాగే విశ్వకర్మ పేరుతో కళాశాల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సి. వెంకటనారాయణమ్మ, జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి కె. ప్రసూన, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాకీర్ హుస్సేన్, సహాయ బీసీ సంక్షేమ అధికారి ఆంజనేయులు, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వి. శ్రీనివాసులు, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్త మృతి నివాళులు అర్పించిన గంగుల ప్రభాకర్ రెడ్డి



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 17 రిపబ్లిక్ న్యూస్ ఆళ్లగడ్డ తాలూకా దొర్నిపాడు మండలం, చాకరాజువేముల గ్రామ వాస్తవ్యులు వైసీపీ కార్యకర్త మైనుద్దీన్ ఈ రోజు గుండెపోటుతో మరణించారు. విషయం తెలిసిన వెంటనే వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి కుటుంబ సభ్యులను ఓదార్చిన కర్నూల్ పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి.

ఆలూరు సెక్టార్ నందు 9 వ జాతీయ పోషణ మహోత్సవాలు

గర్భిణులకు, బాలింతలకు మరియు చిన్నపిల్లల తల్లులకు సమతుల్యమైన ఆహారంపై అవగాహనా సదస్సు -ఆలూరు సిడిపిఓ నరసమ్మ





ఆలూరు , సెప్టెంబర్, 17, (రిపబ్లిక్ న్యూస్)

ఆలూరు మండల పరిధిలోని అంగన్వాడి కేంద్రము 5 నందు అవగాహన సదస్సు కార్యకర్తలు, సహాయకుల సమావేశం నిర్వహించారు. ఆలూరు సిడిపిఓ నరసమ్మ ఆధ్వర్యంలో 9వ జాతీయ పోషణ మహోత్సవాలలో భాగంగా, మహిళలు గర్భిణీలు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి మహోత్సవాలు నిర్వహించడం జరిగినది. గర్భిణులకు, బాలింతలకు మరియు చిన్నపిల్లల తల్లులకు సమతుల్యమైన ఆహారంపై అవగాహన కల్పించడం జరిగినది ప్రోటీన్లు విటమిన్లు తాజా ఆకుకూరలు కాయగూరలు కూరగాయలు అంగన్వాడి కేంద్రం ద్వారా అందించే పోషకాహార కిట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ మహోత్సవాలలో భాగంగా తీవ్రంగా పోషణకు గురవుతున్న పిల్లలను గుర్తించి వారికి తగిన పోషణ మరియు ప్రత్యేక చికిత్స గురించి అవగాహన కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆలూరు సిడిపిఓ నరసమ్మ మరియు సెక్టార్ సూపర్వైజర్ షీబారాణి మరియు కార్యకర్తలు బి.నాగరత్న, సి. జయశ్రీ, ఎం.అక్తరున్నిసా, ఏ.కే.ఫరిదాబి తదితరులు పాల్గొన్నారు.

కమలనగర్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు

విఘ్నేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

కల్లూరు ప్రతినిధి, సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)



కల్లూరు అర్బన్ 20వ వార్డు కమలనగర్‌లో నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గౌరు చరిత రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని విఘ్నేశ్వర స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం మహిళా నాయకురాలు వసుంధర ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు..

కల్లూరులో దీపాలు వెలిగించిన టీడీపీ-బీజేపీ-జనసేన నేతలు





కల్లూరు ప్రతినిధి, సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)కల్లూరు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా కల్లూరు అర్బన్‌లోని చెన్నమ్మ సర్కిల్‌లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి, నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొని దీపాలు వెలిగించి ప్రధాని మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీకి ఆయురారోగ్యాలు, సంపూర్ణ ఆరోగ్యం కలగాలని ఆకాంక్షించారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రి టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరిన మాజీ కార్పొరేటర్ పల్లవి

వైసీపీకి గుడ్‌బై.. అనుచరులతో కలిసి టీడీపీ తీర్థం



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 17)

కర్నూలు నగరంలోని 18వ వార్డు మాజీ కార్పొరేటర్ పల్లవి తన అనుచరులతో కలిసి వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ సమక్షంలో ఆమె టీడీపీ కండువా కప్పుకున్నారు.

మంత్రి టీజీ భరత్ పార్టీ కండువాలు కప్పి పల్లవితో పాటు ఆమె అనుచరులను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ కర్నూలు నగరంలో మంత్రి టీజీ భరత్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని పల్లవి తెలిపారు. కర్నూలు నగర అభివృద్ధికి మంత్రి టీజీ భరత్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.పార్టీలో చేరిన వారిలో ప్రేమకాంత్, మురళి మోహన్, విజయ్ కుమార్, ప్రతాప్, బాబీ, మహాలక్ష్మి ఉన్నారు. కార్యక్రమంలో న్యాయవాది గణేష్ సింగ్, బీజేపీ నాయకులు రాఘవేంద్ర, అవేజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రోగి భద్రతే వైద్య సేవల్లో తొలి ప్రాధాన్యం

కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఘనంగా ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం









కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 17)

కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రపంచ రోగి భద్రతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రిలోని ధన్వంతరి హాల్‌లో నర్సింగ్ సిబ్బంది, విద్యార్థుల కోసం రోగి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా డిప్యూటీ సూపరింటెండెంట్, సైకియాట్రీ ప్రొఫెసర్ డా. ఎన్. నాగేశ్వరరావు మాట్లాడుతూ రోగ నిర్ధారణలో భద్రత, మానసిక శ్రేయస్సు, సురక్షితమైన వైద్య ఫలితాల సాధనలో రోగులు, కుటుంబ సభ్యులు, సమాజ భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

డిప్యూటీ సూపరింటెండెంట్, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డా. ఎస్. లక్ష్మీబాయి కఠినమైన మందుల వినియోగంలో భద్రత, ప్రతికూల ఔషధ ప్రభావాల నివారణ, తృతీయ స్థాయి వైద్యంలో అంటువ్యాధుల సమగ్ర నిర్వహణపై అవగాహన కల్పించారు.

జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డా. శ్రీరాములు ఇన్ఫెక్షన్ నివారణ, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, సురక్షిత టీకాలు, ఇంజెక్షన్ పద్ధతులు, శస్త్రచికిత్స సమయంలో పాటించాల్సిన భద్రతా చర్యలపై పలు సూచనలు చేశారు.అనంతరం రోగులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు, క్లినికల్ నిర్లక్ష్యానికి తావులేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే నిబద్ధతను చాటుతూ వైద్య సిబ్బంది, విద్యార్థులు 'రోగి భద్రతా ప్రతిజ్ఞ' స్వీకరించారు.ఈ కార్యక్రమంలో నర్సింగ్ ఫ్యాకల్టీ, నర్సింగ్ సూపరింటెండెంట్లు, వివిధ క్లినికల్ విభాగాలకు చెందిన నర్సింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చిప్పగిరి విజయ విఠల పాఠశాల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా

షేక్ సలీమాకు ప్రతిష్ఠాత్మక అవార్డు

విజయ విఠల పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి అభినందనీయం

పాఠశాల కరస్పాండెంట్ కిష్టపాడు యూసుఫ్, ప్రధానోపాధ్యాయుడు చంద్రమోహన్





చిప్పగిరి, సెప్టెంబర్, 17, (రిపబ్లిక్ న్యూస్)

మండల కేంద్రంలోని విజయ విఠల ఇంగ్లీష్ మీడియం అప్ స్కూల్‌కు చెందిన హిందీ ఉపాధ్యాయురాలు షేక్ సలీమాకు 2026 గ్లోబల్ ఎడ్యుకేషనల్ అవార్డు ఉత్తమ ఉపాధ్యాయురాలు పురస్కారం లభించడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రమైన గుంటూరులో ఉన్న గుంటూరు మెడికల్ కాలేజ్ నందు టీచర్స్ హబ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గుంటూరు ఈస్ట్ (గుంటూరు తూర్పు) శాసనసభ నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని ఆమె అందుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కిష్టపాడు యూసుఫ్, ప్రధానోపాధ్యాయుడు చంద్రమోహన్ మాట్లాడుతూ.. షేక్ సలీమాకు లభించిన ఈ అవార్డు ఆమె వ్యక్తిగత ప్రతిభకు మాత్రమే కాకుండా విజయ విఠల పాఠశాల విద్యా ప్రమాణాలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు హిందీ భాషపై ఆసక్తి కలిగిస్తూ, పాఠ్యాంశాలను సులభమైన పద్ధతుల్లో బోధించడం, విద్యార్థుల్లో సృజనాత్మకత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం వంటి అంశాల్లో షేక్ సలీమా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతగా భావించి పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సమాజంలో ప్రత్యేక గౌరవం ఉంటుందని కరస్పాండెంట్ కిష్టపాడు యూసుఫ్ పేర్కొన్నారు. పాఠశాలలో ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల విద్యా ప్రగతితో పాటు వారి వ్యక్తిత్వ వికాసానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయుల సమిష్టి కృషి వల్లే పాఠశాల విద్యా రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధిస్తోందన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు చంద్రమోహన్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, వారికి అవసరమైన ప్రోత్సాహం అందించడంలో పాఠశాల ఉపాధ్యాయులు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. విద్యార్థులలో చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సృజనాత్మకత, నైతిక విలువలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. ఉపాధ్యాయుల అంకితభావం, సమన్వయంతో పాఠశాల మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు.విజయ విఠల పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ప్రతి విద్యార్థిలోని ప్రత్యేక నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కిష్టపాడు యూసుఫ్ తెలిపారు. ఉపాధ్యాయుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించడం, పాఠశాల మౌలిక వసతులను అభివృద్ధి చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.షేక్ సలీమా కు లభించిన గ్లోబల్ ఎడ్యుకేషనల్ అవార్డు పాఠశాలలోని ప్రతి ఉపాధ్యాయుడికి స్ఫూర్తినిస్తుందని, భవిష్యత్తులోనూ ఉపాధ్యాయులు మరింత అంకితభావంతో పనిచేసి విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేయాలని వారు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ కిష్టపాడు యూసుఫ్, ప్రధానోపాధ్యాయుడు చంద్రమోహన్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం షేక్ సలీమాను అభినందించి, ఆమె మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సహకారానికి యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

మోదీ జన్మదినం సందర్భంగా దేవనకొండలో 'ఆశీర్వాద్ కా దియా'

కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ నిర్వహించిన నాయకులు, అధికారులు

దేవనకొండ, సెప్టెంబర్ 17(ప్రజా రిపబ్లిక్ న్యూస్):-

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం దేవనకొండ పట్టణంలో 'సేవా సంకల్ప్ అభియాన్‌ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా గ్రామ పంచాయతీ భవనం నుంచి వెంకటేశ్వర స్వామి దేవస్థానం వరకు కొవ్వొత్తులు వెలిగిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమం మోదీ జన్మదిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో ఒకటిగా ప్రధానమంత్రి కార్యాలయం కూడా పేర్కొంది.కార్యక్రమంలో మండల తహసీల్దార్ వై.కె. రామేశ్వర్ రెడ్డి, ఈ ఓ ఆర్ డి గోపాల్, మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మల్లేపల్లి రంగుడు, సొసైటీ చైర్మన్ రాజశేఖర్ గౌడ్, మల్లికార్జున గౌడ్, బండిగింజల రంగన్న, ఆకుల







వీరేష్, రాజు, గోపాల్ గౌడ్, డీలర్ బండ్లయ్య పాల్గొన్నారు. బీజేపీ మండల కన్వీనర్ బొల్లెద్దుల కిరణ్ కుమార్, బోడ రవికుమార్, జంగం వీరయ్య స్వామి, జనసేన నాయకులు కే. ఉచిరప్ప, బుసల రామాంజనేయులు, వన్నూరప్ప, అలారుదిన్నె విజయ్ కుమార్, పొట్లపాడు సుధాకర్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈసందర్భంగా మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు.. బ్రాహ్మణపల్లిలో వెలిగిన 'ఆశీర్వాద దీపం'

టీడీపీ ఆదేశాల మేరకు ఘనంగా

'ఒక దీపం..ఒక ఆశీర్వాదం' సంకల్ప కార్యక్రమం

ఓర్వకల్లు మండలం టిడిపి అధ్యక్షుడు నాగిరెడ్డి



ఓర్వకల్లు ప్రతినిధి, సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)

ఓర్వకల్లు మండలం,బ్రాహ్మణపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఉత్తర్వుల మేరకు, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఆదేశాల మేరకు భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా 'ఒక దీపం.. ఒక ఆశీర్వాదం' సంకల్ప కార్యక్రమాన్ని బ్రాహ్మణపల్లి గ్రామంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఓర్వకల్ టీడీపీ మండల అధ్యక్షులు దుగ్గపూటి నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఆశీర్వాద దీపాన్ని వెలిగించి ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రధాని మోదీ మరింత కాలం సేవలందించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేకంగా సంకల్పం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ రాజశేఖర్ చౌదరి, వెంకటేష్, కరుణాకర్, భాష, ఎల్. సుబ్బు, రమేష్, సంజీవతో పాటు గ్రామ టీడీపీ కార్యకర్తలు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వారం రోజుల పోలీసు కస్టడీకి జోసెఫ్ రావణ్.. కోర్టు కీలక ఆదేశాలు

అమరావతి సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)



సోషల్ మీడియా వేదికగా విద్వేషపూరిత వ్యాఖ్యలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ప్రేరేపించారనే తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ రావణ్ కేసులో గన్నవరం న్యాయస్థానం ఈరోజు కీలక ఉత్తర్వులు వెలువరించింది. ఈ కేసు విచారణలో భాగంగా జోసెఫ్‌ను ఏడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల మేరకు రేపు (సెప్టెంబరు 18) ఉదయం గన్నవరం పోలీసులు అతడిని కస్టడీకి తీసుకోనున్నారు.యువతను రెచ్చగొట్టేలా వీడియోలు రూపొందించడం, ఏలూరులో నిర్వహించిన ఓ సమావేశంలో నక్సలిజం వైపు మళ్లేలా ప్రసంగాలు చేశారనే ఆరోపణలపై ఏపీ పోలీసులు ఆయనపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.ఈ కుట్ర వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్, మాజీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో ఉన్న సంబంధాలు, దీని వెనుక ఉన్న రాజకీయ ప్రయోజనాల కోణంలో లోతుగా విచారించాల్సిన అవసరం ఉందని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం, వారం రోజుల కస్టడీకి అంగీకరించడంతో రాబోయే విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

వైసీపీ మాజీ ఎమ్మెల్యే గనులపై మైనింగ్ శాఖ దాడి.. క్వారీ యంత్రాలు, వాహనాలు స్వాధీనం

అనంతపురం సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)



అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం నేమకల్లు పరిధిలో అక్రమ మైనింగ్ వ్యవహారం కలకలం రేపుతోంది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డికి చెందిన గనుల్లో లీజు నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా తవ్వకాలు సాగిస్తున్నారన్న ఫిర్యాదులపై మైనింగ్ శాఖ అధికారులు ఈరోజు మెరుపు దాడులు నిర్వహించారు.

సాంకేతిక బృందాలతో కలిసి రంగంలోకి దిగిన అధికారులు మైనింగ్ సరిహద్దులు, పరిమితికి మించిన క్వారీయింగ్ ఆరోపణలపై పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టారు. అధునాతన మ్యాపింగ్ ప్రక్రియ ద్వారా నిబంధనలను ఉల్లంఘించి ఎంత మొత్తం ఖనిజాన్ని అక్రమంగా తరలించారో తేల్చేందుకు సర్వే నిర్వహించారు. ఈ సోదాల సందర్భంగా.. మైనింగ్ నిర్వహణకు ఉపయోగిస్తున్న హెవీ యంత్రాలు, పొక్లెయిన్లు, రవాణా వాహనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ తనిఖీలపై మైనింగ్ శాఖ అధికారులు మాట్లాడుతూ.. నేమకల్లు గనుల్లో జరిగిన నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు. మైనింగ్ చట్టాల ప్రకారం బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అక్రమ తవ్వకాలపై విచారణ కొనసాగుతోందని, ఉల్లంఘనలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు.

14 గంటల వెయిటింగ్.. గదులు లేవు, తిండి లేదు.. ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ల కష్టాలు!

న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)



ఆసియా క్రీడల కోసం జపాన్‌లోని నాగోయాకు చేరుకున్న భారత అథ్లెట్లకు చేదు అనుభవం ఎదురైంది. అక్రిడిటేషన్లు ఉన్నప్పటికీ పలువురు క్రీడాకారులకు సకాలంలో వసతి గదులు కేటాయించలేదు. దీంతో 12 గంటలకు పైగా, కొందరు 14 గంటల వరకు గదుల కోసం వేచి చూడాల్సి వచ్చింది. ఈ సమయంలో ఆహారం కూడా అందుబాటులో లేకపోవడంతో అథ్లెట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పేర్కొంది.భారత రోయింగ్ బృందానికి చెందిన క్రీడాకారులు మంగళవారం ఢిల్లీ నుంచి రెండు బృందాలుగా జపాన్‌కు బయల్దేరారు. బ్యాంకాక్‌లో విరామం తర్వాత తొలి బృందం బుధవారం ఉదయం 8 గంటల సమయంలో నాగోయా చేరుకుంది. అక్కడి నుంచి గంట తర్వాత వసతి కోసం ఏర్పాటు చేసిన క్రూజ్ నౌక వద్దకు వెళ్లారు. అయితే గదులు సిద్ధంగా లేకపోవడంతో అక్కడే నిరీక్షించాల్సి వచ్చింది.ఓ రోయర్ 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్'తో మాట్లాడుతూ.. ఉదయం 9 గంటలకు వసతి కేంద్రానికి చేరుకున్నామని, రాత్రి 8.30 గంటల సమయానికి కొద్దిమందికే గదులు లభించాయని తెలిపారు. గదులు పొందిన వారిని కూడా మరికొందరు క్రీడాకారులతో కలిసి ఉండాలని కోరినట్లు చెప్పారు.రోయర్లే కాకుండా భారత షూటర్లు, మరో రెండు జట్లకు కూడా ఇదే పరిస్థితి ఎదురైనట్లు నివేదిక పేర్కొంది. షూటర్లకు కేటాయించిన వసతి కేంద్రాన్ని ఇతర దేశాల బృందాలకు ఇవ్వడంతో వారు మరో హోటల్‌లో బస చేయాల్సి వచ్చింది.భారత ఒలింపిక్ సంఘానికి చెందిన కొందరు సభ్యులను కూడా సమీపంలోని మరో హోటల్‌కు తరలించారు. వైద్య బృందం కూడా తాత్కాలికంగా వారితో కలిసి సర్దుకోవాల్సి వచ్చింది.క్రీడాకారులు, బృందాల సంఖ్యను నిర్వాహకులు సరిగా అంచనా వేయకపోవడం వల్లే ఈ సమస్య తలెత్తినట్లు నివేదిక పేర్కొంది. అందుబాటులో ఉన్న వసతిలో కొంత భాగాన్ని ఇతర దేశాల బృందాలకు కేటాయించడంతో భారత అథ్లెట్లకు గదుల కొరత ఏర్పడినట్లు తెలిపింది. ఆసియా క్రీడల ఆరంభానికి ముందే వసతి ఏర్పాట్లలో తలెత్తిన ఈ గందరగోళం భారత బృందాలకు ఇబ్బందికరంగా మారింది.

మోదీకి రాహుల్, ఖర్గే శుభాకాంక్షలు..

ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్ష

న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)



ప్రధాని నరేంద్ర మోదీ 76వ పుట్టినరోజు సందర్భంగా ప్రతిపక్ష పార్టీల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. మోదీ ఆరోగ్యంగా, సుదీర్ఘకాలం జీవించాలని ఆకాంక్షించారు.లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "ప్రధాని నరేంద్ర మోదీజీకి పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆయన మంచి ఆరోగ్యంతో దీర్ఘాయుష్షుతో ఉండాలని కోరుకుంటున్నా" అని పేర్కొన్నారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా మోదీకి శుభాకాంక్షలు చెబుతూ.. మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సైతం శుభాకాంక్షలు తెలిపారు. బీఎస్పీ అధినేత్రి మాయావతి, ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్, శివసేన (యూబీటీ) నేత ప్రియాంక చతుర్వేది కూడా మోదీకి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు.తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్, డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్ కూడా మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ఆరోగ్యం, సంతోషంతో సుదీర్ఘ జీవితం గడపాలని ఆకాంక్షించారు.మోదీ 76వ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ గురువారం 'సేవా సంకల్ప్ అభియాన్' పేరుతో నెల రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 7తో మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తవుతాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఈ నెల 9న ప్రకటించారు. 2014 నుంచి కేంద్రంలో మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం కొనసాగుతోంది. వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయాల్లో మోదీ కీలకంగా వ్యవహరించారు

చంద్రశేఖరన్ పునర్నియామకం చట్టవిరుద్ధం

: టాటా సన్స్ బోర్డుకు టాటా ట్రస్ట్స్ షాక్

చంద్రశేఖరన్ పునర్నియామకంపై టాటా సన్స్ బోర్డు తీర్మానాన్ని తిరస్కరించిన టాటా ట్రస్ట్స్

ఈ తీర్మానం చట్ట ప్రకారం చెల్లదని, న్యాయబద్ధం కాదని స్పష్టీకరణ

ట్రస్ట్ నామినీ డైరెక్టర్ నోయెల్ టాటా తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు

మాజీ సీజేఐ చంద్రచూడ్ న్యాయసలహాను పరిగణనలోకి తీసుకోని బోర్డు

నాయకత్వ మార్పు ప్రక్రియ జరగాల్సిందేనని తేల్చిచెప్పిన టాటా ట్రస్ట్స్

న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)



టాటా గ్రూప్‌లో నాయకత్వ మార్పు వ్యవహారం కీలక మలుపు తిరిగింది. టాటా సన్స్ చైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పునర్‌నియామకం కోసం బోర్డు చేసిన తీర్మానాన్ని టాటా ట్రస్ట్స్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ తీర్మానం చట్టపరంగా చెల్లదని స్పష్టం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది. దీనితో టాటా సన్స్ బోర్డుకు, మెజారిటీ వాటాదారు అయిన టాటా ట్రస్ట్స్‌కు మధ్య ఉన్న విభేదాలు బహిర్గతమయ్యాయి.

చంద్రశేఖరన్ ప్రస్తుత పదవీకాలం 2027 ఫిబ్రవరి 20తో ముగియనుంది. ఈ నేపథ్యంలో, తాను మళ్లీ చైర్మన్ పదవికి పోటీపడనని ఆగస్టు 12న చంద్రశేఖరన్ స్వయంగా బోర్డుకు తెలియజేశారు. ఆయన నిర్ణయాన్ని ఆమోదించిన టాటా ట్రస్ట్స్, కొత్త చైర్మన్‌ను ఎంపిక చేయడానికి సెలక్షన్ కమిటీని ఏర్పాటు చేయాలని మరుసటి రోజే టాటా సన్స్‌కు సూచించింది.అయితే, గురువారం జరిగిన బోర్డు సమావేశంలో చంద్రశేఖరన్‌ను తిరిగి నియమించాలంటూ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. నలుగురు డైరెక్టర్లు దీనికి అనుకూలంగా ఓటు వేయగా, ట్రస్ట్ నామినీ డైరెక్టర్ అయిన నోయెల్ టాటా ఈ ప్రతిపాదనను వీటో హక్కుతో వ్యతిరేకించారు.కంపెనీ నిబంధనల (ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్) ప్రకారం, చైర్మన్ నియామకానికి లేదా పునర్‌నియామకానికి ట్రస్ట్ నామినీ డైరెక్టర్లందరి మద్దతు తప్పనిసరి. నోయెల్ టాటా వ్యతిరేకంగా ఓటు వేసినందున ఈ తీర్మానానికి చట్టబద్ధత లేదని టాటా ట్రస్ట్స్ వాదిస్తోంది. ఈ వాదనకు మద్దతుగా భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ డి.వై. చంద్రచూడ్ ఇచ్చిన న్యాయసలహాను కూడా నోయెల్ టాటా బోర్డు ముందు ఉంచారు. అయితే, బోర్డు దానిని పరిగణనలోకి తీసుకోలేదని తెలిసింది. నాయకత్వ మార్పు ప్రణాళిక ప్రకారమే జరగాలని, తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని టాటా ట్రస్ట్స్ స్పష్టం చేసింది.

యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు.. మినహాయింపు కోరుతున్న పెట్రోల్ డీలర్లు

యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీల నుంచి మినహాయింపు కోరుతున్న పెట్రోల్ డీలర్లు

రూ.2000 దాటిన ప్రతి లావాదేవీపై రూ.5 ఎండీఆర్ విధింపుపై ఆందోళన

ఈ ఛార్జీలు తమ మార్జిన్లపై భారం మోపుతాయని డీలర్ల సంఘం ఆవేదన

డిజిటల్ మౌలిక వసతుల కోసమే ఎండీఆర్ అని వివరించిన పెట్రోలియం శాఖ

ప్రభుత్వంతో చర్చలు కొనసాగిస్తామని తెలిపిన ఏఐపీడీఏ

న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)



పెట్రోల్ బంకుల్లో ఇంధనం అమ్మకాలపై యూపీఐ ద్వారా చేసే చెల్లింపులకు వర్తించే మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని పెట్రోల్ డీలర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ అంశంపై 'ఆల్ ఇండియా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్' (ఏఐపీడీఏ) ప్రతినిధులు గురువారం కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులతో సమావేశమై చర్చలు జరిపారు.

కొత్త యూపీఐ నిబంధనల ప్రకారం, పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లలో రూ.2,000 దాటిన ప్రతి లావాదేవీపై రూ.5 ఎండీఆర్ ఛార్జీ విధిస్తున్నారు. దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో జరిగే మొత్తం కొనుగోళ్లలో సుమారు 30 నుంచి 40 శాతం లావాదేవీలు ఈ పరిధిలోకి వస్తాయని డీలర్లు చెబుతున్నారు. పెట్రోల్ అమ్మకాలు నిర్దేశిత కమీషన్లపై ఆధారపడి జరుగుతాయని, ఈ అదనపు ఎండీఆర్ ఛార్జీల భారం తమ మార్జిన్లను దెబ్బతీస్తుందని డీలర్ల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది.

ఈ సమావేశంలో మంత్రిత్వ శాఖ అధికారులు ఎండీఆర్ విధింపు వెనుక ఉన్న కారణాలను వివరించారు. దేశంలో యూపీఐ డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, విస్తరణకు ఈ ఛార్జీలు అవసరమని వారు తెలిపారు. మరోవైపు, దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడంలో తాము ముందు వరుసలో ఉన్నామని, ప్రభుత్వంతో కలిసి పనిచేశామని ఏఐపీడీఏ గుర్తుచేసింది.

ఎండీఆర్ అనేది ప్రభుత్వం గానీ, ఎన్‌పీసీఐ గానీ వసూలు చేసే పన్ను కాదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గతంలోనే స్పష్టం చేసింది. యూపీఐ వ్యవస్థ నిర్వహణ, విస్తరణకు సహకరించేందుకు ఈ మొత్తాన్ని బ్యాంకులకు, పేమెంట్ అప్లికేషన్ ప్రొవైడర్లకు పంచుతారని తెలిపింది. ఇంధనం, రైల్వేలు, టెలికాం, బీమా, వ్యవసాయం వంటి తక్కువ మార్జిన్లు ఉండే కీలక రంగాల్లో రూ.2,000 దాటిన లావాదేవీలకు ఈ రూ.5 ఫ్లాట్ ఛార్జీని వర్తింపజేస్తున్నారు.

ప్రభుత్వంతో చర్చలు కొనసాగిస్తామని, వినియోగదారులు, డీలర్లు, యూపీఐ భాగస్వాములు అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నామని ఏఐపీడీఏ ఒక ప్రకటనలో పేర్కొంది.

మోదీ ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్..

ప్రధాని వాడిన ఆ పదాల అర్థమేంటో తెలుసా?

ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్ వాడుతున్న ప్రధాని మోదీ

యువతకు చేరువయ్యేందుకు కొత్త కమ్యూనికేషన్ వ్యూహం

'ఫ్లెక్స్', 'ఫోమో', 'ఓజీ' వంటి పదాల వినియోగం

ఎస్ఆర్‌సీసీ, ఇండియా-డెన్మార్క్ సదస్సుల్లో ఈ పదాల ప్రస్తావన

యువ ఓటర్లను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా విశ్లేషణ

న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)



ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగ శైలిలో మార్పులు చేస్తూ, యువతకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా, నేటి తరం యువత (జెన్-జీ) ఎక్కువగా వాడే ఆధునిక పరిభాషను, స్లాంగ్ పదాలను తన ప్రసంగాల్లో ఉపయోగిస్తూ అందరినీ ఆకర్షిస్తున్నారు. ఆయన ప్రసంగాల్లో ఈ కొత్త పదజాలం వాడటం వెనుక, యువ ఓటర్లను ఆకట్టుకోవాలనే స్పష్టమైన వ్యూహం కనిపిస్తోంది.ఇటీవల ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ కళాశాల పూర్వ విద్యార్థులను 'ఓజీ' లుగా అభివర్ణించారు. జెన్-జీ పరిభాషలో 'ఓజీ' అంటే 'ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్' అని అర్థం. అంటే తమ రంగంలో అత్యంత ప్రావీణ్యం ఉన్నవారిని, ప్రత్యేకమైన వారిని గౌరవంగా ఇలా పిలుస్తారు.

ఇదే ప్రసంగంలో 'ఫ్లెక్స్' అనే పదాన్ని కూడా ఆయన వాడారు. "ఈ రోజుల్లో కూడా ఢిల్లీ యూనివర్సిటీలో మీరు ఎస్ఆర్‌సీసీ విద్యార్థి అని చెప్పుకోవడం ఒక 'ఫ్లెక్స్' లాంటిది" అని ఆయన వ్యాఖ్యానించారు. తమకున్న హోదాను, నైపుణ్యాన్ని లేదా విజయాన్ని గర్వంగా ప్రదర్శించడాన్ని 'ఫ్లెక్స్' అంటారు.

ఇంతకుముందు 2022లో డెన్మార్క్ ప్రధానితో కలిసి ఇండియా-డెన్మార్క్ బిజినెస్ ఫోరమ్‌లో ప్రసంగిస్తూ ప్రధాని 'ఫోమో' అనే పదాన్ని ప్రస్తావించారు. 'ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్' అనే పదబంధానికి సంక్షిప్త రూపమే ఈ 'ఫోమో'. సోషల్ మీడియాలో ఈ పదం చాలా ప్రాచుర్యం పొందింది. భారత్‌లో పెట్టుబడులు పెట్టని వారు గొప్ప అవకాశాన్ని కోల్పోతారని, వారు 'ఫోమో'కు గురవుతారని చెప్పడానికి మోదీ ఈ పదాన్ని చమత్కారంగా ఉపయోగించారు.ప్రధాని మోదీ ఈ తరహా పదాలను ఉపయోగించడం ఒక విస్తృత కమ్యూనికేషన్ వ్యూహంలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు. సోషల్ మీడియా, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ తరహా కంటెంట్‌తో యువతను ఆకట్టుకోవడం దీని ప్రధాన ఉద్దేశం.

సంప్రదాయ రాజకీయ ప్రసంగాలకు భిన్నంగా, మారుతున్న కాలానికి అనుగుణంగా తనను తాను మలచుకుంటూ యువతరంతో మమేకం అయ్యేందుకు మోదీ చేస్తున్న ఈ ప్రయత్నం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

మేడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల,లో ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం





రాయికల్ మండలం సెప్టెంబర్,17 (రిపబ్లిక్ న్యూస్) జగిత్యాల జిల్లా మేడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల,లో సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ కొంక వేణు ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ ప్రాముఖ్యతను, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నేపథ్యాన్ని విద్యార్థులకు సవివరంగా వివరించారు. దేశ చరిత్రలో, తెలంగాణ చరిత్రలో ఈ రోజు ప్రాధాన్యతను విద్యార్థులు తెలుసుకోవాలని నిజాం నిరంకుశ పాలనకు చరమాగీతం పాడిన రోజు అని ఎందరో ప్రాణాల అర్పణతో ఏర్పడిన తెలంగాణని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అనీష్, రాజు, విశ్వ ప్రసాద్, గుర్రాల సాయి కృష్ణ, అరుణ్, రాజశేఖర్, లక్ష్మణ్, నాగేశ్వరి, జ్ఞానేశ్వర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరై ఈ వేడుకలను విజయవంతం చేశారు.

తెలంగాణ గడ్డపై నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించిన

అమరవీరులకు జగిత్యాలలో జనసేన నాయకుల నివాళి

రాయికల్ మండలం

సెప్టెంబర్,17(రిపబ్లిక్ న్యూస్)

తెలంగాణ గడ్డపై నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జనసేన పార్టీ నాయకులు కొనియాడారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని, జగిత్యాల నియోజకవర్గ కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ విమోచన పోరాట యోధులు, అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు



వేసి శ్రేణులు ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు బెక్కం జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ నేల పౌరుషానికి, ఆత్మగౌరవ పోరాటాలకు ప్రతీక అని ఆయన స్పష్టం చేశారు. నాడు నిజాం ముష్కరుల బారి నుంచి ఈ గడ్డను విముక్తి చేయడం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన అమరుల త్యాగస్ఫూర్తిని స్మరించుకుంటూ, వారి ఆశయాలను నేటి తరానికి అందించడం మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు.జనసేన పార్టీ అధినేత, గౌరవనీయ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి ఆశయాలకు అనుగుణంగా సమాజ హితం కోసం, క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం జగిత్యాల జనసేన శ్రేణులు నిరంతరం కట్టుబడి పనిచేస్తాయని ఈ సందర్భంగా బెక్కం జనార్దన్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రముఖ నాయకులు గట్ల శ్రీకర్, రవి, కృష్ణ, ప్రవీణ్, నరేష్, అరుణ్ మరియు పార్టీ క్రియాశీలక కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమరవీరులకు జై కొట్టారు.

నమాజు చేస్తూ ఇమామ్ గుండెపోటుతో ఇమాముద్దీన్ సాహెబ్ మృతి

రాయికల్ పట్టణ ప్రజా ప్రతినిదులు సంతాపం

రాయికల్ మండలం సెప్టెంబర్,17(రిపబ్లిక్ న్యూస్)



జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ జమా మజీద్ "ఇమామ్" ఇమాముద్దీన్ సాహెబ్ మృతి చెందాడు మంగళవారం అస్సర్ నమాజ్ నిర్వహిస్తున్న సమయంలో ఆయన గుండెపోటు రావడంతో మసీదులోనే తుది శ్వాస విడిచినట్టు తెలిసింది ఆయన ఆకస్మిక మృతితో రాయికల్ పట్టణంలోని ముస్లిం సమాజంలో విషాదఛాయాలు అలుముకు న్నాయి ఇమాముద్దీన్ సాహెబ్ జమా మజీద్ ఇమామ్ గా చాలా కాలంగా సేవలందిస్తూ పలు కార్యక్రమాల్లో ముస్లిం ప్రజలకు మార్గదర్శకత్వం అందించారు విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బంధువులు మసీదు కమిటీ సభ్యులు స్థానిక ముస్లిం సమాజశీ ప్రతినిధులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు ఇలా ఉండగా నమాజ్ చేస్తూ ఇమామ్ చనిపోవడం దురదృష్టమని పలువురు ప్రజా ప్రతినిధులు రాయికల్ మాజీ సర్పంచ్ ఎద్దండి భూమరెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షులు గన్నవరం ప్రభాకర్, రాయికల్ మున్సిపల్ చైర్మన్ కటకం రవీందర్, వైస్ చైర్మన్ తురగ సౌజన్య శ్రీధర్ రెడ్డి, రాయికల్ పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు ఎలిగేటి అనిల్ కుమార్,అలాగే రాయికల్ మున్సిపల్ మాజీ కోఆప్షన్ నెంబర్ డాక్టర్ పిప్పోజీ మహేందర్ బాబు, మహమ్మద్ షంషీర్, మున్నుభాయి, ముజాహిద్, అమీర్, వెంకటరమణ మెడికల్ అధినేతలు బుడికే గంగన్న,రాజశేఖర్, సుంకే శంకర్, సత్య ప్రభు, దుర్గెట్టి రంగయ్య గట్టు లక్ష్మీ నరసయ్య (ఎన్ ఎల్ జి,) మహమ్మద్ శుక్రుద్దీన్, గల్ఫ్ ఏజెంట్ సుక్క,ఇంటర్నేషనల్ ఉమెన్స్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జగిత్యా జిల్లా అధ్యక్షులు ఆడెపు రాజమౌళి, రియాద్ సాట అధ్యక్షులు శ్రీనివాస్ మచ్చ సంతాపం తెలిపారు

ఎంబీబీఎస్ ఫలితాల్లో మెరిసిన రైతు బిడ్డ

463 మార్కులతో సాయి హాసిని ప్రతిభ -వైద్య విద్యలో సత్తా చాటిన దేవనకొండ యువతి

కర్నూలు సెప్టెంబర్ 17(రిపబ్లిక్ న్యూస్)



వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన సాయి హాసిని వైద్య విద్యలో ప్రతిభ చాటుతూ ఎంబీబీఎస్ ఫలితాల్లో మెరిశారు. దేవనకొండ మండలానికి చెందిన ఆమె ఎంబీబీఎస్ పరీక్షల్లో 463 మార్కులు సాధించి తన ప్రతిభను నిరూపించుకున్నారు. హాల్‌టికెట్ నంబర్ 143958తో పరీక్షలకు హాజరైన సాయి హాసిని జిఎంసిఎన్ లో ఎంబీబీఎస్ సిఏ-ఎస్ఎఫ్-1లో చోటు దక్కించుకున్నారు.సాయి హాసిని తండ్రి గిరిధర్ రైతుగా జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. తల్లి విమల దేవనకొండ మండలంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందినప్పటికీ చిన్ననాటి నుంచే వైద్య విద్యపై ఆసక్తి పెంచుకున్న సాయి హాసిని, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివారు.చదువుపై ఏకాగ్రత, నిరంతర శ్రమ, పట్టుదలతో ముందుకు సాగిన ఆమె ఎంబీబీఎస్‌లో 463 మార్కులు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన విద్యార్థిని వైద్య విద్యలో రాణించడం తమకు ఎంతో గర్వకారణమని వారు పేర్కొన్నారు.సాయి హాసిని సాధించిన విజయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైతం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తన కృషి, పట్టుదలతో లక్ష్యాన్ని సాధించవచ్చని ఆమె నిరూపించారు.భవిష్యత్తులో వైద్య రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగి, పేదలు మరియు గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షించారు. సాయి హాసిని విజయంపై దేవనకొండ ప్రాంతానికి చెందిన పలువురు విద్యావేత్తలు, ప్రజలు



అభినందనలు తెలిపారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి తల్లిదండ్రులకు, స్వగ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రాయికల్ మండలం గిరిజన తండాలలో కె.సి.ఆర్ కీ పాలాభిశేకం





రాయికల్ మండలం సెప్టెంబర్,17(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బిఆర్ఎస్ కల్వకుంట్ల చంద్రశేఖర రావు చిత్రపటానికి పాలతో క్షీరాభిషేకం చేసిన మాజీ కౌన్సిలర్ తురగా శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొని పాలాభిషేకం చేశారు అలాగే తెలంగాణకు విమోచనమంటూ వచ్చింది కేవలం బి.ఆర్.యస్ ప్రభుత్వంలో అప్పటి తెలంగాణా తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కే.సీ.ఆర్) ఆధ్వర్యంలో గిరిజనులకు ఎస్టి రిజర్వేషన్ 6% నుండి 10% కి పెంచడంతో పాటు తండాలను గ్రామ పంచాయితీలుగా ఏర్పాటు చేయడం లాంటి కెసిఆర్ వల్లనేనని సెప్టెంబర్ 17 తెలంగాణకు నిజమేన విమోచన దినోత్సవం టిఆర్ఎస్ పార్టీ వల్లే వచ్చింది అని గుర్తు చేసుకుంటూ గత బి.ఆర్.యస్ ప్రభుత్వంలోనే గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేసరని గిరిజన నాయకులు అన్నారు.మళ్ళీ తెలంగాణ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు మంచి రోజులు రావాలన్న, అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందాలన్నా కెసిఆర్ తోనే సాధ్యమన్నారు.జగిత్యాల జిల్లా రాయికల్ మండలం గిరిజన గ్రామాలు మరియు తండాల చింతలూరు బషీర్ తండా కటకాపూర్ తండా ఇటిక్యాల తండా కైరే గూడెం, చిలకలగూడెం, బోర్నపల్లి తండా దేవన్నపల్లి, వస్తాపూర్,రాజనగర్ తండాలలో కే.సి.ఆర్ గారి చిత్ర పటానికి పాలాభిశేకం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు మరియు బి.ఆర్. యస్ శ్రేణులు పాల్గొన్నారు...

కట్కాపూర్లో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన గ్రామ సర్పంచ్ పడాల పూర్ణిమ తిరుపతి

రాయికల్ మండలం

సెప్టెంబర్,17(రిపబ్లిక్ న్యూస్)







జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కట్కాపూర్ గ్రామంలో తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సర్పంచ్ పడాల పూర్ణిమ జాతీయ జెండాను ఆవిష్కరించిశీది

ఇట్టి కార్యక్రమానికి రాయికల్ మాజీ ఎంపీపీ కట్కాపూర్ సర్పంచ్ పడాల పూర్ణిమ తిరుపతి ఉప సర్పంచ్ గణేష్ మరియు వార్డు మెంబర్లు నాయని రాజు పద్మ రాజులు రంజిత్ అంజి లక్ష్మి మరియు మహిళ సంఘాల సిఏలు సుజాత మల్లేశం మహిళ మండలం అధ్యక్షులు మహిళా సంఘాల సభ్యులు గ్రామ ప్రజలు అందరు పాల్గొన్నారు

నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడిన రోజు సెప్టెంబర్17

-రాయికల్ పట్టణ బిజెపి అధ్యక్షుడు కురుమ మల్లారెడ్డి

రాయికల్ మండలం సెప్టెంబర్,17(రిపబ్లిక్ న్యూస్)





తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపల్ పట్టణ అధ్యక్షులు కూర్మ మల్లారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరించడం జరిగింది.

సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఒక ముఖ్యమైన రోజు. నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిన సందర్భంగా ఈ రోజును తెలంగాణ విమోచన దినోత్సవంగా గుర్తిస్తారు.

తెలంగాణ ప్రజలు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగించిన పోరాటంలో రైతులు, విద్యార్థులు, మహిళలు, ప్రజలు ధైర్యంగా పాల్గొన్నారు. రజాకారుల అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాడారు. ఈ పోరాటంలో అనేక మంది తమ ప్రాణాలను త్యాగం చేశారు.1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, త్యాగాలను స్మరించుకోవడం మరియు ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడం ఈ రోజు మనకు గుర్తుచేస్తుంది. అలాగే భారత ప్రధాని నరేంద్ర మోడీ విశ్వ గురువు పుట్టినరోజు సందర్భంగా రాయికల్ గవర్నమెంట్ హాస్పిటల్ నందు రోగులకు పండ్లు పంచడం జరిగింది ఈ కార్యక్రమంలో రాయికల్ భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు కూర్మ మల్లారెడ్డి, రాష్ట్ర ఓబిసి ఉపాధ్యక్షులు మచ్చ నారాయణ , రాయికల్ పట్టణ ప్రధాన కార్యదర్శి కునారపు భూమేష్ , కౌన్సిలర్ వేముల రాము , తోపారపు సురేష్ ,వాసం రమేష్ రమాదేవిసురతాని భాగ్యలక్ష్మి , కైరం సుదర్శన్ , గద్దె మురళి ,బోడుగం శ్రీకాంత్ రెడ్డి ,కడార్ల శ్రీనివాస్ , కట్కం కిషోర్ , అల్లె నర్సయ్య , వాసం నరసయ్య, దాసరి సంతోష్, బూర్ల గోపి, సుతారి కిషన్, సింగు నరేష్, శేఖర్, ఎలిగేటి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు

రాయికల్ మార్కండే ఆలయంలో మృణ్మయ పూజ భక్తి, ప్రకృతి పరిరక్షణకు ప్రతీక



రాయికల్ మండలం సెప్టెంబర్,17(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని విశ్వపాలిని సేవా సమితి మార్కండేయ మందిరం వారి ఆధ్వర్యంలో శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం మృణ్మయ పూజా కార్యక్రమం ప్రారంభించారు ఈ సందర్భంగా పురోహితులు గణపవరపు మల్లికార్జున శర్మ మాట్లాడుతూ మృణ్మయ అంటే మట్టితో చేసినది, పూజ అంటే దైవాన్ని ఆరాధించడం. ఈ సంప్రదాయంలో ముందుగా మట్టితో శివలింగాన్ని తయారు చేసి ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. అనంతరం అదే మట్టి సంప్రదాయబద్ధంగా అమ్మవారి విగ్రహ రూపాన్ని సంతరించుకుని దేవీ నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుడుతుంది. ఉత్సవాలు ముగిసిన అనంతరం నిమజ్జనం ద్వారా మట్టి తిరిగి ప్రకృతిలో కలుస్తుంది తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ పద్మశాలి సేవా సంఘం కడుకుంట్ల నరేష్,దాసరి గంగాధర్, సామళ్ళ సతీష్, వాసం స్వామి మరియు యువజన సంఘం సభ్యులు విగ్రహ దాతలు బాలే శేఖర్, జయశ్రీ,బాలే నిఖిల్ కుమార్ పాల్గొన్నారు.

వెలుగోడు లో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించిన జిల్లా ఎస్పీసునీల్ షోరాణ్.

..మోటార్ సైకిల్ పై పలు వీధులలో సంచరిస్తూ అధికారులకు దిశా నిర్దేశం.





వెలుగోడు సెప్టెంబర్,17(రిపబ్లిక్ న్యూస్)

వెలుగోడు పట్టణ కేంద్రంలో నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతమైన వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జరిగేలా నంద్యాల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, స్వయంగా వెలుగోడు పట్టణానికి చేరుకుని బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పట్టణంలోని ప్రధాన వీధులు, నిమజ్జన మార్గాల్లో మోటార్ సైకిల్‌పై స్వయంగా పర్యటిస్తూ పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.నిమజ్జన కార్యక్రమానికి హాజరయ్యే భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ ప్రాంతాల్లో భద్రత, నిమజ్జన శోభాయాత్ర సజావుగా కొనసాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు జిల్లా ఎస్పీ దిశానిర్దేశం చేశారు.

ప్రజలు శాంతియుతంగా, సోదరభావంతో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని, పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ సూచించారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

జిల్లా ఎస్పీ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ భద్రతా ఏర్పాట్లను పరిశీలించడం ద్వారా పోలీసు సిబ్బందిలో మరింత సమన్వయం, అప్రమత్తత పెరిగింది. వెలుగోడు పట్టణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా పోలీసు శాఖ పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టింది.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

హజ్ యాత్ర కు మహిళలకు మెహ్రం విభాగంలో 500 సీట్లు కేటాయింపు

ఈనెల 23 నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తుల స్వీకరణ.

మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి



అమరావతి,సెప్టెంబరు17(రిపబ్లిక్ న్యూస్):
హజ్–2027 యాత్రకు సంబంధించి మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ఏర్పాట్లను పూర్తి చేసిందని మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.మెహ్రం విభాగం కింద 500 హజ్ సీట్లనుకేటాయించేందుకు అవకాశం కల్పించినట్లు గురువారం అమరావతి లో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. మెహ్రం తోడుగా హజ్ యాత్రకు వెళ్లాలనుకున్నప్పటికీ, పాస్‌పోర్ట్ లేదా ఇతర కారణాల వల్ల గతంలో దరఖాస్తు చేసుకోలేక పోయిన అర్హత కలిగిన మహిళా యాత్రికులకు ఈ ప్రత్యేక కేటగిరీ ద్వారా అవకాశం కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈనెల 23వ తేదీ నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం అవుతుందని తెలిపారు. అక్టోబర్ 7వ తేది వరకు దరఖాస్తుల స్వీకరణ తుది గడువుగా హజ్ కమిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించిందని తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళా యాత్రికులు **www.haj-committee.gov.in** ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులందరూ హజ్2027 యాత్రకు సంబంధించిన నిబంధనలు,అర్హతలను పూర్తిగా పరిశీలించి, అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ అవకాశాన్ని రాష్ట్రానికి చెందిన, అర్హత కలిగిన మహిళా హజ్ యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు.

నంద్యాలలో అఖిలపక్ష ఐక్యవేదిక సమరభేరి

ఆర్ ఏ ఆర్ ఎస్ నూనెపల్లె మార్కెట్ యార్డు స్థలాల పరిరక్షణకు పోరుబాట

మద్దిసుదర్శన్ నగర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ..

సంతకాల సేకరణకు వెల్లువెత్తిన ప్రజానీకం



నంద్యాల సెప్టెంబర్ 17(రిపబ్లిక్ న్యూస్) :
రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధే దేశ ఆహార భద్రతకు పునాది అని, వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే చర్యలను సహించేది లేదని అఖిలపక్ష ఐక్యవేదిక స్పష్టం చేసింది. గురువారం నంద్యాల పట్టణంలోని మద్దిసుదర్శన్ నగర్‌లో అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు విస్తృతంగా పర్యటించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం స్థానిక మార్కెట్ యార్డు భూముల పరిరక్షణ ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తూ ప్రజా మద్దతును కూడగట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన పోస్టల్ కార్డుల ద్వారా ప్రజల నుండి సంతకాల సేకరణ (ప్రజాభిప్రాయ సేకరణ) చేపట్టారు.

ప్రజాభిప్రాయ పోస్టల్ కార్డులోని ప్రధాన అంశాలు:

మార్కెట్ యార్డు భూముల కేటాయింపుపై నిరసన:
రైతాంగానికి ఎంతగానో ఉపయోగపడే నూనెపల్లె మార్కెట్ యార్డుకు చెందిన 2 ఎకరాల విలువైన భూమిని ఒక రాజకీయ పార్టీ కార్యాలయానికి 33 సంవత్సరాల లీజుకు కేటాయించడం సరైనదేనా? అని ప్రజలను ప్రశ్నించగా, దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది.

ఆర్ ఏ ఆర్ ఎస్ ప్రాగణంలో తాత్కాలిక కలెక్టరేట్ కొనసాగింపుపై ఆగ్రహం:
వ్యవసాయ పరిశోధనలు, రైతులకు ప్రత్యక్ష సేవలు అందించే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆవరణలో తాత్కాలిక కలెక్టరేట్‌ను ఇంకా కొనసాగించడం ఎంతవరకు సబబు? అని ప్రజల అభిప్రాయాలను కోరారు.

రైతాంగ హక్కుల కోసం పోరాటం ముమ్మరం:
మద్దిసుదర్శన్ నగర్ పరిధిలోని స్థానికులు, రైతులు ఈ సంతకాల సేకరణకు పెద్ద ఎత్తున స్పందించి తమ మద్దతు తెలిపారు. భూముల కేటాయింపులు, పరిశోధనా స్థానాల ఆక్రమణలపై ఆందోళన వ్యక్తం చేస్తూ అఖిలపక్ష ఐక్యవేదిక పిలుపునకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రైతుల ప్రయోజనాలను కాలరాస్తే రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనర్ ఏరువ రామచంద్రారెడ్డి, ఐక్యవేదిక నాయకులు, ప్రముఖ న్యాయవాది శంకరయ్య,జానయ్య చౌడప్ప, ప్రొఫెసర్ కైప శివరామిరెడ్డి, యర్రం శంకర్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు, క్రిష్టియన్ జోజా నాయకులు మోహన్ బాబు, రవికుమార్, ఏసురాజు, ప్రకాష్, ప్రశాంత్,యోబు, పీటర్, జాషువా, సురేష్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలను సద్వినియోగం చేసుకునేలా దీర్ఘకాలిక ప్రణాళిక

తాగునీటి వృథాను అరికట్టి లీకేజీలను తక్షణమే సరిచేయాలి

కర్నూలు, నంద్యాల జిల్లాలకు తాగునీటి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలి

జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి







నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)
కృష్ణా జలాలను సమర్థవంతంగా వినియోగించుకునేలా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అవసరమైన రిజర్వాయర్ల నిర్మాణానికి దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వ్యవసాయం, తాగునీరు, నీటిపారుదల తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు, కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి, నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్ రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే డా. పార్థసారథి వాల్మీకి, ఉభయ జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాల సద్వినియోగానికి దీర్ఘకాలిక ప్రణాళిక అవసరమన్నారు. కృష్ణా నది ద్వారా సముద్రంలోకి వెళ్తున్న నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టి సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని చైర్మన్ సూచించారు. గుండ్రేవుల ప్రాజెక్టు రాష్ట్రాల మధ్య అంశంగా ఉన్నందున తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఎస్ఆర్‌బీసీ పరిధిలో రెండు జిల్లాలకు అవసరమైన నీటి కేటాయింపులు, నిల్వ సామర్థ్యాన్ని పెంచే చర్యలపై దృష్టి సారించాలన్నారు. శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 854 అడుగులకు చేరుకునేలోపే గోరుకల్లు, అవుకు తదితర రిజర్వాయర్లు, చెరువులను పూర్తి స్థాయిలో నింపుకునేలా ముందస్తు నీటి నిర్వహణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయాలి
కర్నూలు, నంద్యాల జిల్లాల్లో తాగునీటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలో నీటిని పొదుపుగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని చైర్మన్ సూచించారు. పైప్‌లైన్‌లు, కుళాయిల వద్ద ఏర్పడే లీకేజీలను నిరంతరం పర్యవేక్షిస్తూ తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో కొత్త కుళాయిలు ఏర్పాటు చేయాలన్నారు. ఫిర్యాదులు వచ్చిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తు పర్యవేక్షణతో నీటి వృథాను అరికట్టాలని కోరారు.

తాగునీటి అవసరాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి
గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌ల పరిధిలో తాగునీటి సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉన్న నిధులు పరిమితంగా ఉన్నందున కర్నూలు, నంద్యాల జిల్లాలకు ప్రభుత్వం తక్షణ సహాయ నిధులు కేటాయించాలని జడ్పీ చైర్మన్ కోరారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ సభ్యుల ఏకాభిప్రాయంతో జిల్లా పరిషత్‌లో తీర్మానం చేసినట్లు తెలిపారు.

కరువు పరిస్థితులపై రైతులకు అండగా నిలవాలి
వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు తగిన సహాయం అందించడంతో పాటు కర్నూలు, నంద్యాల జిల్లాలను కరువు జిల్లాలుగా ప్రకటించాలని జడ్పీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు సమావేశంలో ప్రతిపాదించారు. పంట నష్టపోయిన రైతులకు సహాయం, ఉపాధి హామీ పనిదినాల పెంపు, అన్నదాత సుఖీభవ పథకం వర్తింపు, రైతులకు రుణాలు, పంటల బీమా సదుపాయం కల్పించడం తదితర అంశాలపై ప్రభుత్వానికి తీర్మానాలు పంపించాలని నిర్ణయించారు. నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, శ్రీశైలం జలాశయంలో నీటి లభ్యత తక్కువగా ఉండటంతో ప్రస్తుత పరిస్థితుల్లో సాగు పంటలకు నీరు అందించే అవకాశం లేదన్నారు. అయితే, తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ తెలుగు గంగ, ఎస్ఆర్‌బీసీ, కే.సీ. కెనాల్ ద్వారా నీటిని అందిస్తున్నట్లు సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా కలెక్టర్ వివరించారు. జిల్లాలో సాగవుతున్న పంటల విస్తీర్ణం తదితర వివరాలను ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తున్నామని, ప్రతి రైతు పంటల బీమా చేసుకోవడంతో పాటు ప్రతి పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకునేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. డోన్ వాటర్ గ్రిడ్ ద్వారా 138 గ్రామాలకు తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేయగా, ప్రస్తుతం 90 గ్రామాలకు నీరు అందిస్తున్నామని, అక్టోబర్ చివరి నాటికి అన్ని గ్రామాలకు పూర్తి స్థాయిలో నీటిని అందించేలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. పగిడ్యాల, నందికొట్కూరు మండలాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శ్రీశైలం జలాశయానికి సాధారణంగా ప్రతి సంవత్సరం సుమారు 600 టీఎంసీల వరకు నీరు చేరుతుండగా, ప్రస్తుత పరిస్థితుల్లో సుమారు 215 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉందని, అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ పొదుపుగా వినియోగిస్తున్నామని కలెక్టర్ వివరించారు.

రోడ్లపై 'సేఫ్టీ మార్కింగ్'

రూ.50 లక్షలతో 14 కూడళ్లలో రోడ్ మార్కింగ్స్.. వాహనదారులు, పాదచారుల భద్రతే లక్ష్యం





కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 17) నగరంలో వాహనదారులు, పాదచారుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రధాన రహదారులు, కూడళ్లలో రోడ్ మార్కింగ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు.గాంధీనగర్ సమీపంలోని శోభన్‌బాబు కూడలి వద్ద జరుగుతున్న రోడ్ మార్కింగ్స్ పనులను కమిషనర్ పరిశీలించారు. నగరంలో రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు వాహనదారులు, పాదచారులకు స్పష్టమైన మార్గదర్శకత్వం కల్పించేందుకు సెంటర్ లైన్స్, ఎడ్జ్ లైన్స్, లేన్ లైన్స్, జీబ్రా క్రాసింగ్స్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుంచి రూ.50 లక్షలతో 14 కూడళ్లు, ప్రధాన రహదారులపై అవసరమైన రోడ్ మార్కింగ్ పనులు చేపడుతున్నట్లు కమిషనర్ వెల్లడించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.అనంతరం వినాయక ఘాట్‌ను కమిషనర్ పరిశీలించారు. సెట్కూరు కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసి, పరిసరాల పరిశుభ్రతను కాపాడాలని నిర్వాహకులకు సూచించారు. క్యాంటీన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు.

స్వచ్ఛతా హి సేవతో పరిశుభ్రమైన కర్నూలు

దీపాలు వెలిగించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కలెక్టర్ డా. ఏ. సిరి






కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 17) స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేసి జిల్లాను పరిశుభ్రమైన కర్నూలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి పిలుపునిచ్చారు. తన నివాసంలో దీపాలు వెలిగించి స్వచ్ఛతా హి సేవ కార్యక్రమానికి కలెక్టర్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, కార్యాలయాలు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంపొందించడంతో పాటు, పారిశుద్ధ్య కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి, పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, డీఆర్వో వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ తదితరులు పాల్గొని దీపాలు వెలిగించారు.

విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

వసతి గృహ సంక్షేమ శాఖ అధికారులు వసతి గృహాలను నిరంతరము పర్యవేక్షించాలి : జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా



నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్)
జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తూ, వారికి నాణ్యమైన విద్యను అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల నిర్వహణ, విద్యార్థుల భద్రత, విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, రికార్డుల నిర్వహణ, ఆర్థిక వ్యవహారాలు, సంక్షేమ కార్యక్రమాలపై శివారెడ్డి డిప్యూటీ డైరెక్టర్, సోషల్ వెల్ఫేర్ (నోడల్ ఆఫీసర్), పిఓ, ఐటీడీఏ శ్రీశైలం,కన్వీనర్, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ , జాకీర్ హుస్సేన్ బీసీ వెల్ఫేర్, హుస్సేనయ్య ట్రైబల్ వెల్ఫేర్,సబియా పర్వీన్ మైనారిటీ, రైస్ ఫాతిమా వికలాంగుల శాఖ,గీత డిసిఓ, రెసిడెన్షియల్ స్కూల్స్, డిఇఓ జనార్దన్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు వికలాంగుల శాఖ వసతి గృహాల అధికారులు, మోడల్ స్కూల్స్, కేజీబీవీ స్కూల్స్, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపాల్ మరియు ఆశ్రమ పాఠశాలల వార్డెన్లు, ప్రిన్సిపాల్ ల తో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వసతి గృహాలను సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల అధికారులు హాస్టళ్లను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వసతి గృహాలను కనీస మౌలిక సదుపాయాలు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యార్థులకు స్వచ్ఛమైన, కాచి చల్లార్చిన తాగునీటిని విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. టాయిలెట్లు, పరిసరాల పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షిస్తూ, హాస్టళ్లలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం విద్యార్థులకు కడుపునిండా నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా పాటించాలన్నారు. సమయానుకూలంగా భోజనం విద్యార్థులకు అందించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని విద్యార్థులు ఇతర విషయాల వైపు దృష్టి మరలకుండా చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించేలా చూడాలని తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వారి పురోగతిని తల్లిదండ్రులకు తెలియజేయాలనీ అధికారులను ఆదేశించారు. పనితీరు సరిగా లేని వసతి గృహాలు పనితీరు మెరుగుపరచుకోవాలన్నారు. వసతి గృహాలలో పరిస్థితుల్లో ఆశించిన మార్పు కనిపించకపోతే, బాధ్యులైన అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం, భద్రతతో పాటు వారి విద్యా పురోగతే ప్రధాన లక్ష్యంగా అన్ని సంక్షేమ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ప్రధానమంత్రిమోదీ 25 ఏళ్ల ప్రజాసేవకు కృతజ్ఞతగా దీపోత్సవం

పంచలింగాలలో కొవ్వొత్తులు వెలిగించిన కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 17 (రిపబ్లిక్ న్యూస్) భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినం, ప్రజా జీవితంలో 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్‌ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమంలో భాగంగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పంచలింగాల గ్రామంలోని తన నివాసంలో కొవ్వొత్తులు వెలిగించి దీపోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను స్మరించుకుంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం మోదీ అందిస్తున్న సేవలను కొనియాడారు. మోదీకి ఆయురారోగ్యాలు, మరింత శక్తి ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ దీపాలు వెలిగించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com